
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 14 జూలై 2025



19న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం



విశాఖపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని ఈ నెల 19న నిర్వహించనున్నట్టు కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు అవసరమైన అజెండా తయారీ కోసం ప్రతిపాదనలను వివిధ విభాగాల నుంచి తెప్పించుకుంటున్నారు. స్టాండింగ్ కమిటీ సమావేశంపై ఇప్పటికే సభ్యులకు సమాచారం ఇచ్చిన అధికారులు.. అజెండా ఖరారయ్యాక వాటి ప్రతులను వారికి అందజేస్తామని పేర్కొన్నారు.

పోలీస్ శాఖలో వసూల్ రాజాలు!

బెల్ట్ దుకాణాలపై దాడుల పేరుతో వసూళ్లు

- సీజ్ చేసిన మద్యంలో చేతివాటం
- సీపీ చర్యలు తీసుకుంటున్నా మారని సిబ్బంది వైఖరి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా నగర పోలీస్ శాఖలో కొందరు సిబ్బంది అక్రమ సంపాదనకు పరితపిస్తున్నారు. అవకాశం దొరికితే చాలు నగదు రాబట్టడమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. మద్యం దుకాణాల వద్ద న్యూసెన్స్, బెల్ట్ షాపులపై దాడులు పేరుతో అందిన కాడికి దోచుకుని జేబులు నింపుకుంటున్నారు. గత కొంతకాలంగా ఈ తరహా పోలీసుల దందాలు భారీగా జరుగుతుండగా.. కొన్ని ఉదంతాలు మాత్రమే బయటపడుతున్నాయి. ఇలాంటి ఘటనల్లో బాధ్యులపై సీపీ శంఖబ్రత బాగ్చి చర్యలు తీసుకుంటున్నప్పటికీ పోలీసుల వసూళ్ల పర్వానికి అడ్డుకట్ట పడకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

నగర పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది అడ్డగోలు సంపాదనపై ఇటీవల కాలంలో ఫోకస్ పెంచారు. సీపీగా శంఖబ్రత బాగ్చి బాధ్యతలు చేపట్టిన కొత్తలో నగరంలో పనిచేయడానికి చాలామంది అధికారులు భయపడి రేంజ్‌కు వెళ్లిపోవడానికి ప్రయత్నించగా, రేంజ్ నుంచి నగరానికి రావాలనే ప్రయత్నాల్లో ఉన్నవారు సైతం తమ ప్రయత్నాలను విరమించుకున్నారు. విధి నిర్వహణలో అలసత్వం, అవినీతి వంటి విషయాల్లో సీపీ కఠినంగా వ్యవహరిస్తారనే అభిప్రాయం పోలీస్ శాఖలో ఉండడమే ఇందుకు కారణంగా చెప్పుకోవాలి. అయితే సీపీగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తవడంతో శంఖబ్రతబాగ్చితో నగరంలో పనిచేస్తున్న కొందరు అధికారులతో చనువు పెరిగింది. సీఐలు, ఏసీపీ స్థాయి అధికారులు సైతం సీపీకి ఎదురు సమాధానం చెప్పడానికి భయపడే పరిస్థితి పోయి, ఏదైనా జరిగితే దానికి గల కారణాలతోపాటు బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా చర్చించే పరిస్థితి వచ్చిందనే అభిప్రాయం పోలీస్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో కొంతమంది అధికారులు, వారి అండదండలు కలిగిన సిబ్బంది అవినీతి విషయంలో కాస్త దూకుడు పెంచారు. అవకాశం దొరికితే డబ్బులు వస్తాయనుకునే ఎలాంటి అవకాశాన్ని కూడా వదిలిపెట్టడం లేదు. స్టేషన్‌కు వచ్చే కేసులు, సివిల్ సెటిల్‌మెంట్ల సంగతి సరేసరి. మద్యం దుకాణాల నుంచి వసూళ్లతో పాటు మద్యం షాపుల వద్ద తాగి తిరిగే వారిని గుర్తించి న్యూసెన్స్ పేరుతో కేసులు పెడతామని బెదిరించడం, బెల్ట్ షాపుల పేరుతో మద్యాన్ని అనధికారికంగా విక్రయించే వారి ఇళ్లు, దుకాణాల్లో సోదాలు చేయడం



ద్వారా సంబంధిత నిర్వాహకులను బెదిరించి డబ్బులు గుంజేస్తున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. పైగా బెల్ట్ షాపుల వద్ద సీజ్ చేసిన మద్యం సీసాలను కూడా చాలా వరకు పక్కదారి పట్టించేసి అధికారికంగా కొద్ది మొత్తంలోనే దొరికినట్టు చూపించి, మిగిలిన సీసాలను సొంతానికి వాడుకుంటున్నారు. రెండు నెలల కిందట సాగర్‌నగర్ వద్ద బీచ్ రోడ్డులోని ఓ మద్యం దుకాణంలో మద్యం కొనుగోలు చేసిన వ్యక్తితో పాటు సమీపంలో ఏకాంతంగా గడుపుతున్న ఒక జంటను పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ బెదిరించి వారి నుంచి వేరొక వ్యక్తికి డబ్బులను ఫోన్ పే చేయించి.. ఆ తరువాత అతని వద్ద నుంచి తన అకౌంట్‌కు పంపించుకున్నాడు. దీనిపై బాధితులు 'ఆంధ్రజ్యోతి'కి సమాచారం ఇవ్వడంతో దీనిపై కథనం ప్రచురించగా, సీపీ ... మిగతా 6వ పేజీలో

పెళ్లింట్లో భారీ చోరీ

- వెంకటేశ్వర కాలనీలో 700 గ్రాముల బంగారం, 3 కిలోల వెండితో పాటు రూ.20 లక్షల నగదును అపహరించుకుపోయిన దుండగులు
- కుప్పకూలిన కుటుంబ సభ్యులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న గాజువాక క్రైమ్ పోలీసులు



బీరువాలోని వస్తువులను దొంగలు చిందరవందరగా పడేసిన దృశ్యం

అక్కిరెడ్డిపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ 69వ వార్డు పరిధి వెంకటేశ్వర కాలనీలో భారీ చోరీ జరిగింది. కుమార్తె పెళ్లి కోసం ఇంట్లో భద్రపరిచిన 700 గ్రాముల బంగారం, మూడు కిలోల వెండి సామగ్రితో పాటు రూ.20 లక్షల నగదు చోరీకి గురవ్వడంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. చోరీకి గురైన మొత్తం విలువ రూ.కోటి వరకు ఉంటుందని అంచనా. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఎల్ఐసీలో ఉద్యోగం చేస్తున్న ఎస్.శ్రీనివాస్ కుటుంబంతో సహా వెంకటేశ్వర కాలనీలోని లక్ష్మి రెసిడెన్సీలో రెండో అంతస్థులో ఉంటున్నారు. శ్రీనివాస్ కుమార్తెకు పెళ్లి సంబంధం కుదరడంతో వచ్చే నెల 10వ తేదీన నిశ్చితార్థం చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో బ్యాంక్ లాకర్‌లో భద్రపరిచిన బంగారు ఆభరణాలు, వెండి సామగ్రి, ఇతర విలువైన వస్తువులను తెచ్చి ఇంట్లో భద్రపరిచారు. పెళ్లి పనుల్లో భాగంగా ఇంట్లో పెయింటింగ్ పనులు చేయించారు. దీంతో ఇళ్లంతా పెయింటింగ్ వాసన వస్తుండడంతో శనివారం రాత్రి దిగువ ఫ్లోర్ ఖాళీగా ఉండడంతో కుటుంబ సభ్యులందరూ అక్కడే నిద్రించారు. ఆదివారం తెల్లవారుజామున నిద్రలేచి రెండో అంతస్థులోకి వచ్చి చూసేసరికి ఇంటి తాళం విరగ్గొట్టి ఉండడంతో పాటు లోపల సామాన్లు చిందరవందరగా పడివున్నాయి. అనుమానం వచ్చి లోపల ఉన్న బీరువాను తెరిచి చూడగా అందులో భద్రపరిచిన 700 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు కిలోల వెండి ... మిగతా 6వ పేజీలో

పెండింగ్‌లో మెస్ ఛార్జీలు



జిల్లాలోని బీసీ, సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు మూడు నెలలుగా బిల్లులు మంజూరు కాని వైనం

- ఒక్కో హాస్టల్‌కు నెలకు రూ.80 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు..
- ఆయా వార్డెన్లకు తప్పని ఇబ్బందులు
- 11 నెలలుగా విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను చెల్లించని ప్రభుత్వం

విశాఖపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల మెస్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. గడిచిన మూడు నెలల నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో వసతిగృహాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో బీసీ, సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన 53 హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో సాంఘిక సంక్షేమశాఖకు చెందిన ఎనిమిది ప్రీ, 15 పోస్టు మెట్రిక్ హాస్టల్స్ ఉండగా, బీసీ సంక్షేమశాఖకు చెందిన 12 ప్రీ, 18 పోస్టు మెట్రిక్ హాస్టల్స్ ఉన్నాయి. ఒక్కో హాస్టల్‌లో 50 నుంచి వందమంది వరకు విద్యార్థులు ఉంటున్నారు. ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు నెలకు రూ.1400 చొప్పున ప్రభుత్వం మెస్ చార్జీలను చెల్లిస్తోంది. పోస్టు మెట్రిక్ హాస్టల్ విద్యార్థికి నెలకు రూ.1,600 చొప్పున చెల్లిస్తున్నారు. ఆయా హాస్టళ్లకు మార్చి, ఏప్రిల్, జూన్ నెలలకు సంబంధించిన బిల్లులను చెల్లించాల్సి ఉంది. పోస్టు మెట్రిక్ హాస్టల్‌లో ఉండే విద్యార్థుల సంఖ్యను బట్టి నెలకు రూ.90 వేల నుంచి రూ.1.60 లక్షల వరకు, ప్రీ మెట్రిక్ హాస్టళ్లకు రూ.84 వేల నుంచి రూ.1.40 లక్షల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. సగటును చూసుకున్న ఒక్కో హాస్టల్‌కు నెలకు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. మూడు నెలల నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో ఒక్కో హాస్టల్‌కు రూ.మూడు లక్షలకు పైగానే బిల్లులు చెల్లించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారంటున్నారు. మారిన మెనూ ప్రకారం ప్రతిరోజూ పోషకాలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు వడ్డించాల్సి వస్తోందని, అయితే బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ... మిగతా 6వ పేజీలో

కోళ్ల వ్యర్థాల వార్!

జీవీఎంసీ పరిధిలో సేకరణ కోసం రెండు వర్గాలుగా విడిపోయిన కార్పొరేటర్లు

- గతంలో టెండర్ దక్కించుకున్న వారికి ఒక వర్గం సహకారం
- వైసీపీ చోటా నేత చికెన్ వ్యర్థాలు సేకరించుకునేలా మరో వర్గం అండదండలు
- ఒకరి వాహనాలను ఒకరు పట్టుకుని అధికారులకు అప్పగిస్తున్న ఇరు వర్గాలు
- తాజాగా కోళ్ల వ్యర్థాల వాహనాలను అనకాపల్లి వద్ద అడ్డుకున్న అధికారులు



వాహనాలను పట్టుకున్న రెవెన్యూ, పోలీస్ జీవీఎంసీ సిబ్బంది

- టీమ్ జీవీఎంసీ వాట్సాప్ గ్రూపులో ఒకరిపై ఒకరు ఆరోపణలతో పోస్టింగులు
- సమగ్ర దర్యాప్తునకు కమిషనర్ ఆదేశించి కోళ్ల వ్యర్థాల మాఫియాను ఛేదించాలని మరికొందరు కార్పొరేటర్ల డిమాండ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ)లో కోళ్ల వ్యర్థాల సేకరణ అంశం వివాదాస్పదమవుతోంది. చికెన్ వ్యర్థాల సేకరణకు జోన్లవారీగా జీవీఎంసీ గతంలో పిలిచిన టెండర్లను అధికారులు నెల రోజులు కిందట రద్దు చేయగా, కాంట్రాక్టర్లు కోర్టుకు వెళ్లడంతో స్టే విధించారు. దీంతో గత కాంట్రాక్టర్లు యథావిధిగా చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరిస్తుండగా... మరోవైపు వైసీపీకి చెందిన చోటా నేత పేరుతో కొందరు కోళ్ల వ్యర్థాలను వాహనాలతో సేకరించడం ఆరంభించారు. వీరంతా చికెన్ వ్యర్థాలను కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు కాకుండా చేపల చెరువులకు తరలిస్తుండడంతో ఒకరి వాహనాలను మరొకరు పట్టుకుని అధికారులకు అప్పగిస్తున్నారు. ఇందుకు వైసీపీ, టీడీపీకి చెందిన కొందరు కార్పొరేటర్లు సహకరిస్తున్నారంటూ 'టీమ్ జీవీఎంసీ' వాట్సాప్ గ్రూపులో ఒకరిపై ఒకరు ఆరోపణలు గుప్పించుకుంటుండడంతో కార్పొరేటర్ల మధ్య సవాళ్లు తారస్థాయికి చేరాయి.

జీవీఎంసీ పరిధిలోని చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరించి వాటిని కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకు తరలించి, అక్కడ భూమిలో పాతిపెట్టడానికి జీవీఎంసీ ఏడాది కిందట జోన్లవారీగా టెండర్లు పిలిచింది. అయితే చికెన్ వ్యర్థాలకు చేపల చెరువుల నిర్వాహకుల నుంచి భారీగా డిమాండ్ ఉంది. చికెన్ వ్యర్థాలను చేపలకు మేతగా వేస్తే వేగంగా పెరగడంతో పాటు బరువు కూడా ఎక్కువగా వస్తుంది. దీంతో చికెన్ వ్యర్థాల కోసం చేపల పెంపకందారులు పోటీ పడుతుంటారు. అందువల్ల చాలామంది చికెన్ వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించకుండా అనకాపల్లి, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని చేపల చెరువులకు తరలిస్తుంటారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది కాబట్టి చికెన్ వ్యర్థాలను చేపల చెరువులకు తరలించే వాహనాలపై అధికారులు కేసులు నమోదు చేస్తుంటారు. కానీ చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్లు దక్కించుకునేవారి వెనుక టీడీపీ, వైసీపీకి చెందిన కొందరు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు ఉండడంతో అధికారులు చేష్టలూడిపోతుంటారు.

గత ఏడాది చికెన్ వ్యర్థాల కోసం పిలిచిన టెండర్లలో కూడా కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు జోక్యం చేసుకుని తమ ... మిగతా 6వ పేజీలో

కలెక్టర్ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామన్న అధికారులు



విశాఖపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ సృష్టించారు. కలెక్టర్ పేరు, ఫొటోతో ఈ అకౌంట్‌ను తెరిచినట్టు అధికారులు గుర్తించారు. ఈ అకౌంట్ నుంచి రిక్వెస్ట్‌లు వచ్చినా, ఇతర డిమాండ్లు చేసినా ఎవరూ స్పందించవద్దని అధికారులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్టు వెల్లడించారు. ఇది పూర్తిగా నకిలీ అకౌంట్ అని, ఈ అకౌంట్ నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని కలెక్టరేట్ అధికారులు ఒక ప్రకటనలో కోరారు.



రామానాయుడు స్టూడియో ప్రారంభోత్సంలో దివంగత డి.రామానాయుడు, వైఎస్సార్తో కోట శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

విశాఖతో కోట అనుబంధం

విశాఖపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావుకు విశాఖపట్నంతో మంచి అనుబంధం ఉంది. ఆదివారం ఆయన మృతి చెందిన సందర్భంగా పలువురు ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సుమారు నాలుగు దశాబ్దం క్రితం వచ్చిన 'ప్రతిఘటన' సినిమా షూటింగ్ విశాఖలో పలుచోట్ల జరిగింది. పార్కు హోటల్ పరిసరాలు, గవర్నర్ బంగ్లా రోడ్డులో బేతనీ స్కూల్, కేర్ (అప్పట్లో సీడీఆర్) ఆస్పత్రి ఎదురుగా రోడ్డుపై జరిగిన షూటింగ్‌లో కోట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 'గిల్లికజ్జాలు' సినిమాకు సంబంధించి ఆయన పలు సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించారు. కళారంగాలకు చెందిన ప్రముఖులకు ఇచ్చే వంశీ బర్కిలి అవార్డు ప్రదానం చాలాకాలం క్రితం విశాఖలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోటాకు వంశీ బర్కిలి అవార్డును ఇక్కడే ప్రదానం చేశారు. కాగా 2008లో రామానాయుడు స్టూడియో ప్రారంభోత్సవానికి స్టూడియో అధినేత డి.రామానాయుడుతో కలిసి కోట శ్రీనివాసరావు ఇక్కడకు విచ్చేశారు. విశాఖ ఏజెన్సీలో పలు సినిమాల షూటింగ్‌ల్లో పాల్గొన్న ఆయన.. సాగరతీరంలో జరిగిన టి.సుబ్బరామిరెడ్డి సేవా పీఠం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలకు సైతం హాజరయ్యారు.



కేఆర్ఎం కాలనీలో వర్షపు నీటి ప్రవాహానికి కొట్టుకుపోతున్న ద్విచక్ర వాహనం

పిడుగుల వాన

గంటపాటు ఏకధాటిగా కురిసిన భారీ వర్షం

- ఉరుములు, పిడుగుల శబ్దాలతో భీతిల్లిన నగరవాసులు
- సీతమ్మధారలో 34 మి.మీ., ధారపాలెంలో 24 మి.మీ., వర్షపాతం నమోదు
- కేఆర్ఎం కాలనీలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన రెండు బైకులు
- ఎండ తీవ్రత, ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం



రైల్వే స్టేషన్ రోడ్డు జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

విశాఖపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండగా.. ఆ తరువాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. నల్లని మబ్బులు కమ్మేసి ఉరుములు, పిడుగులు శబ్దాలు మొదలవ్వడంతో నగరం దద్దరిల్లింది. చెవులకు చిల్లులు పడేలా, గుండెలు అదిరేలా పలుచోట్ల ఉరుములు పడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సుమారు గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ... మిగతా 6వ పేజీలో

నిధుల సమాచారం ఇవ్వకపోవడం తప్పే..

- బిల్లుల పెండింగ్‌తో జడ్పీటీసీ సభ్యుల్లో కొంత అసంతృప్తి
- ఆర్థిక సంఘం నిధుల గురించి సమావేశంలో కాకుండా నేరుగా అడిగితే బాగుండేది
- ఇకపై ఒకేరోజు సాధారణ, స్టాండింగ్ సమావేశాలను నిర్వహించం
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



విలేకరులతో మాట్లాడుతున్న సుభద్ర

విశాఖపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను మండలాలకు కేటాయించే సమాచారం జడ్పీటీసీ సభ్యులకు ఎప్పటికప్పుడు చెప్పకపోవడం పొరపాటేనని జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అంగీకరించారు. అలాగే సాధారణ నిధులతో చేపట్టిన పనులకు సుమారు రూ.8 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో జడ్పీటీసీ సభ్యుల్లో కొంతవరకు ... మిగతా 6వ పేజీలో



కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

నగరానికి కేంద్రమంత్రి సర్బానంద్

నేటి నుంచి నగరంలో 'బిమ్స్‌టెక్స్' అంతర్జాతీయ సదస్సు

విశాఖపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి)

నగరంలో సోమవారం నుంచి రెండు రోజులపాటు జరగనున్న 'బిమ్స్‌టెక్' అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఆదివారం రాత్రి కేంద్ర జల రవాణా శాఖా మంత్రి సర్బానంద్ సోనోవాలా ఇక్కడకు చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు విశాఖ పోర్టు చైర్మన్ అంగముత్తు, డిప్యూటీ చైర్మన్ దూబే, తదితరులు స్వాగతం పలికారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనారసింహునికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు.ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు ఒక్కొక్కటిగా పసిడి కుసుమాలతో పూజలు జరిపారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. అలాగే స్వామివారిని రజిత గరుడ వాహనంపై ఉంచి గరుడ సేవ జరిపారు.

వెంకన్న సన్నిధిలో సుదర్శన హవనం



హవనం చేస్తున్న రుత్వికులు

సింహాచలం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి కొండదిగువ పూదోటలో ఉన్న వేంకటేశ్వరస్వామి సన్నిధిలో సుదర్శన హవనాన్ని ఆదివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామి వారి ఆవిర్భావ నక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని ప్రతి నెలలో ఒక్కరోజు లోక కల్యాణార్థం అన్న సంకల్పంతో సుదర్శన హవనం చేయడం ఆనవాయితీ. ఈమేరకు ప్రభాతారాధనలు తరువాత స్వామి వారికి పంచామృతాభిషేకాలు జరిపారు. యజ్ఞకర్తగా సుదర్శన పెరుమాళ్‌ను ప్రత్యేక వేదికపై ఉంచి విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనములు, షోడశోపచారాల పూజలు చేశారు. శాస్త్ర విధానంలో బింబారాధన, కలశారాధన, మండపారాధన చేసి హోమ కుండంలో అగ్ని ప్రతిష్టాపన జరిపారు. మహాపూర్ణాహుతి తరువాత ప్రధాన కలశంలోని జలాలకు అంతరాలయంలో పూజలు చేసి భక్తులను ప్రోక్షణ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

తగరపువలస,జూలై 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఇప్పటి నుంచే ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలని భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ పి. చిరంజీవిరావు సూచించారు. చిట్టివలస బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతుల్లో ఆదివారం ఆయన మాట్లాడారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం ట్రాఫిక్ ఎస్ఐని ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, మోహనరావు, పి. నాగేశ్వరరావు, రమణ, అప్పారావు పాల్గొన్నారు.

మధురవాడ పీఏసీఎస్ ఛైర్మన్‌గా ప్రసాద్

మధురవాడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి త్రిసభ్య కమిటీని నియమిస్తూ సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఛైర్మన్‌గా పోతిన ప్రసాద్, సభ్యులుగా పైడిరాజు, వెంకట మీనాక్షి నియమితులయ్యారు.

'ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి'

ఎండాడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాని వైసీపీ నాయకులు కార్యకర్తలకు సూచించారు.ఎండాడ లా కళాశాల రోడ్డులో ఉన్న ఆ పార్టీ కార్యాలయంలో భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీను అధ్యక్షతన కార్యకర్తల నియోజకవర్గ స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జమిలి ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నందున గ్రామాల్లో, పట్టణాల్లో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, నాయకులు కదిరి బాబూరావు, కరణం ధర్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట్లో భారీ చోరీ

... 5వ పేజీ తరువాయి

సామగ్రి, ఇతర విలువైన వస్తువులతో పాటు రూ.20 లక్షల నగదు, పట్టుచీరలు కనిపించకపోవడంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు గాజువాక క్రైమ్ సీఐ శ్రీనివాస్ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలు వచ్చి వివరాలు సేకరించాయి. అదేవిధంగా సంఘటనా స్థలాన్ని క్రైమ్ డీసీపీ లతామాధురి, ఏసీపీ లక్ష్మణరావుతో పాటు సీసీఎస్ సీఐ కె.రామారావులు పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ శాఖలో వసూల్ రాజాలు!

... 5వ పేజీ తరువాయి

స్పందించి విచారణకు ఆదేశించారు. విచారణలో హెడ్ కానిస్టేబుల్ పలువురు నుంచి ఫోన్ పే ద్వారా డబ్బులు వసూలు చేసినట్టు తేలడంతో ఆయనను ఇటీవల విధుల నుంచి సస్పెండ్ చేశారు. అలాగే కంచరపాలెం వద్ద బెల్ట్ షాపుపై దాడి పేరుతో ఓ కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులు వెళ్లి కొన్ని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడితో పాటు అతనికి మద్యం సరఫరా చేసిన మద్యం దుకాణం నిర్వాహకులను బెదిరించి డబ్బులు వసూలు చేసినట్టు తెలిసింది. అనంతరం యథావిధిగా ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి కేసు నమోదు చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. కాగా సీజ్ చేసిన మద్యం సీసాల్లో సగం బాటిళ్లను సిబ్బంది పక్కన పెట్టి, మిగిలిన సగం సీసాలనే సీజ్ చేసినట్టు రికార్డుల్లో చూపడంతో బాధితులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై విచారణ జరిపిన సీపీ.. బాధితుల ఆరోపణలు నిజమేనని తేలడంతో ముగ్గురినీ విధుల నుంచి సస్పెండ్ చేస్తూ రెండు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలావుండగా భీమిలిలో ఇటీవల పోలీసులు ఒక బెల్ట్ షాప్‌పై దాడిచేసి 123 మద్యం సీసాలను పట్టుకున్నారు. గ్రామంలో జాతర కోసం మద్యం కొనుగోలు చేసుకున్నామని చెప్పినాసరే...నిబంధనలకు విరుద్ధంగా భారీగా మద్యం నిల్వ ఉండడంతో బెల్ట్ షాపుగానే భావించి పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే స్వాధీనం చేసుకున్న 123 సీసాల్లో కేవలం 58 బాటిళ్లను మాత్రమే సీజ్ చేసినట్టు చూపించిన పోలీసులు, మిగిలిన మద్యం సీసాలను ఏం చేశారనే దానిపై మద్యం దుకాణం నిర్వాహకులతోపాటు బెల్ట్ షాప్ కేసులో అరెస్టయిన బాధితుడు సిబ్బందిని ప్రశ్నించారు. అంత పెద్దసంఖ్యలో మద్యం సీసాలు దొరికనట్టు చూపిస్తే పెద్ద కేసు అయిపోతుందని పోలీసులు బెదిరించడంతో వారంతా కిమ్మనకుండా ఉండిపోయారు. తాజాగా శనివారం గోపాలపట్నం లక్ష్మీనగర్‌లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేసి కొన్ని మద్యం సీసాలను సీజ్ చేసి స్టేషన్‌కు తీసుకువచ్చారు. కానీ స్టేషన్‌లో కీలకంగా వ్యవహరించే ఓ హెడ్ కానిస్టేబుల్ సీజ్ చేసిన మద్యంలో సగానికి పైగా సీసాలను పక్కన పెట్టేసి మిగిలినవి మాత్రమే సీజ్ చేసినట్టు చూపించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. నగరంలో ఈ తరహా ఘటనలు ప్రతిరోజూ జరుగుతున్నాయని పలువురు మద్యం వ్యాపారులు చెబుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సీపీ శంఖబ్రత బాగ్చి ఇప్పటికైనా క్షేత్ర స్థాయిలో సిబ్బంది, అధికారుల పనితీరుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయకపోతే పోలీస్ శాఖ ప్రతిష్ట మసకబారడం ఖాయమని ఆ శాఖకు చెందిన పలువురు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేడుకకు ఓ మొక్క..

- కొత్త ట్రెండింగ్
- పుట్టినరోజు, పెళ్లిరోజుల్లో బహుమతిగా అందజేత
- పర్యావరణ పరిరక్షణకు దోహదం

మధురవాడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) :ప్రతి వేడుకకు ఓ మొక్క నాటడం ఇప్పుడు కొత్త ట్రెండ్. ఈ విధానం పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది. ఇళ్లల్లో జరిగే పుట్టినరోజు, పెళ్లిరోజు, బారసాల, పిల్లల అక్షరాభ్యాసం.. ఇలా వేడుక ఏదైనా ఇంట్లో వారి పేరుతో ఒక మొక్క నాటడం అందరిలోనూ అలవాటుగా మారుతోంది. ఇటీవల ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశా లల్లో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీట్‌లో కూడా పాఠశాలల ఆవరణలో పిల్లలు తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటారు. పర్యావరణ పరిరక్షణకు చెట్లను పెంచాల్సిన అవసరాన్ని ప్రతిఒక్కరూ గుర్తిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మొక్కలు నాటడానికి అనుకూలం. దీంతో మధురవాడ పరిసరాల్లోని నర్సరీలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. కడియం లంక, చెన్నై, రాజమహేంద్రవరం ప్రాంతాల్లోని పెద్ద పెద్ద నర్సరీలు నుంచి మధురవాడ పరిసరాల్లో ఉన్న పది నర్సరీలకు వివిధ రకాల మొక్కలను యజమానులు తెప్పిస్తున్నారు. వాటిని కొనుగోలు దారుల ఆసక్తిమేరకు విక్రయిస్తున్నారు. క్రోటన్స్, నిమ్మ, దానిమ్మ, మామిడి, సపోటా, జామ, గులాబీ, మందార, సంపంగి,బంతి, అక్రిట్స్, అలవేరా, అంబ్రెల్లా, ఆక్సిజన్ ప్లాంట్, స్నేక్ ప్లాంట్ తదితర మొక్కలను అమ్ముతున్నారు. అలాగే స్టార్ ఫ్రూట్, దానిమ్మ, టేబుల్ నిమ్మ తదితర పండ్ల మొక్కలను పిందెలుతో విక్రయిస్తున్నారు. ఔషధ మొక్కలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇటీవల మిద్దె సాగు పెరగడంతో వాటి అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నాయని వుడాకాలనీలోని ఎస్‌కేఎంఎల్ నర్సరీ యజమాని శ్రీనివాస్ తెలిపారు.



నర్సరీలో క్రోటన్స్ మొక్కలు

సేవలన్నీ ఒకేచోట..

నర్సరీల్లో మొక్కలతో పాటు పూల కుండీలను విక్రయిస్తున్నారు. వాటికి సేంద్రియ ఎరువులు, కోకోపిట్, మెత్తని మట్టిని కూడా సమకూర్చుతున్నారు. ఎక్కువ మొక్కలు, పూల కుండీలు కొనుగోలు చేసిన వారికి డోర్ డెలివరీ సౌకర్యం కల్పిస్తున్నారు.కూరగాయల విత్తనాలు, వాటర్ క్యాన్‌లు, గొప్పులు తవ్వుకునే పరికరాలు, గెడ్డపారలు, కలుపు తీసుకునే పరికరాలు అన్నీ ఒకేచోట లభ్యం కావడంతో కొనుగోలుదారులుకు సమయం ఆదా అవుతోందని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వేడుకకు గుర్తు...



ఇంట్లో జరిగే ప్రతి వేడుకకు ఒక మొక్క నాటుతాం. కుటుంబంలో పిల్లల పుట్టినరోజుతో పాటు ప్రతి వేడుకలో పాల్గొన్న అతిథులకు పూల మొక్కను రిటర్న్ గిఫ్ట్‌గా ఇస్తుంటాం. వేడుకల్లో వేసిన మొక్కలను కంటిపాపలా కాపాడుతుంటాం.పూల మొక్కలు, పండ్ల మొక్కలు ఇంటి ఆవరణలో వేస్తుంటాం. పర్యావరణ పరిరక్షణ పట్ల అంద రికీ బాధ్యత ఉండాలి.

- ప్రసన్న, మధురవాడ



తెలుపు సంపంగి

కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మధురవాడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత క్రమపద్ధతిలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఏడో వార్డులోని శ్రీనివాసనగర్‌లో జరిగిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట తప్పడం లేదన్నారు. తల్లికి వందనం, ఫీజురీయింబర్స్‌మెంట్, సామాజిక పింఛన్లు తదితర పథకాలను పక్కాగా అమలు చేస్తున్నారని తెలిపారు. వచ్చేనెల నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయనున్నట్టు చెప్పారు. కాగా స్థానిక సమస్యలపై కొందరు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవానిపాలెంలో...

సాగర్‌నగర్ : గుడ్లవానిపాలెంలో కూటమి నాయకులు ఆదివారం సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. అనంతరం ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెట్టుపల్లి సన్యాసిరావు, బి. దొరబాబు, కె. ఎల్లయ్యరెడ్డి, కె. పోలిరెడ్డి, ముత్యాలరెడ్డి, వంశీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసనగర్‌లో ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

అప్పన్నకు ఒడిశా దాసుడి గరుడసేవ



గరుడ వాహనంపై తిరువీధి, భక్తుల కోలాటం

సింహాచలం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఒడిశాకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకోదాసుడు గరుడసేవ జరిపించారు. ఆదివారం రాత్రి ఆరాధన తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శోభాయమానంగా అలంకరించి రజిత గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం ఒడిశా కళాకారుల కోలాటాలు, నృత్యాలతో భక్తులు ఆనందోత్సాహాలు, మంగళవాయిద్యాల నడుమ మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, ఒడిశాకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

తగరపువలస, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు రాష్ట్ర నుంచి హాజరవుతున్న క్రీడాకారులకు పది రోజుల పాటు జరిగే శిక్షణ శిబిరం చిట్టివలస బంతాట మైదానంలో ఆదివారం ప్రారంభమైంది. అండర్-16 విభాగంలో వివిధ జిల్లాల నుంచి ఎంపికైన క్రీడాకారులు ఈ శిబిరానికి హాజరయ్యారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఈనెల 26న మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని కోచ్ దాదా ఖలందర్ తెలిపారు.

పర్యాటకులతో భీమిలి బీచ్ కిటకిట



సందర్శకులతో కిటకిటలాడుతున్న తీరం

భీమునిపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్ సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. వారాంతపు సెలవు కావడంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి సందర్శకులు అధికంగా తరలివచ్చారు. ఉదయం నుంచి ఎండ ఉండగా, సాయంత్రం మబ్బులు వేయడంతో తీరంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.

'పర్యాటకులతో గౌరవభావంతో మెలగాలి'



మాట్లాడుతున్న మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు

సాగర్‌నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకులతో గౌరవభావంతో మెలగాలని మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం ఆయన రుషికొండ బీచ్‌లో పర్యాటక శాఖ, ప్రైవేట్ ఆపరేటర్లు నిర్వహిస్తున్న స్పీడు బోటు డ్రైవర్లు, సిబ్బందితో మాట్లాడారు. బ్లూఫ్లాగ్ బీచ్‌గా అభివృద్ధి చెందుతున్న రుషికొండకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉందని, సిబ్బంది వారితో మర్యాదగా ప్రవర్తించి, బీచ్ ఉన్నతికి, పర్యాటకాభివృద్ధికి సహకరించాలని చెప్పారు. బోటుషికార్ నిర్వహణలో సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

పెండింగ్‌లో మెస్ చార్జీలు

... 5వ పేజీ తరువాయి

వెండర్స్ సరకులు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదని పేర్కొంటున్నారు. ఈ తరహా ఇబ్బందులు నిత్యం పరిపాటిగా మారడంతో తమకు అవస్థలు తప్పడం లేదని పలువురు వార్డెన్లు వాపోతున్నారు.

11 నెలలుగా కాస్మోటిక్ చార్జీలు పెండింగ్..

విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను కూడా గడిచిన 11 నెలల నుంచి చెల్లించలేదు. వసతిగృహాల్లో ఉండే విద్యార్థుల కాస్మోటిక్ అవసరాల కోసం ప్రభుత్వం కొంత మొత్తం చొప్పున చెల్లిస్తోంది. పోస్టు మెట్రిక్ హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులకు రూ.210 నుంచి రూ.250, ప్రీ మెట్రిక్ హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులకు నెలకు రూ.110 నుంచి రూ.160 వరకు చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే చివరిసారిగా కాస్మోటిక్ చార్జీలను గడిచిన ఏడాది ఆగస్టులో చెల్లించినట్టు తెలుస్తోంది. 11 నెలల నుంచి కాస్మోటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు తల్లిదండ్రులే వారికి అవసరమైన కాస్మోటిక్ వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలను తక్షణమే చెల్లించాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఒక్కో విద్యార్థికి రూ.1,200 నుంచి రూ.1,700 వరకు ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలను చెల్లించాల్సి ఉంది.

కిడ్నీ కోసం ఇద్దరి చర్చ

అదుపులోకి తీసుకున్న పోలీసులు

సీతమ్మధార, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజుల క్రితం అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న బేకాన్ హోటల్ వద్ద ఇద్దరు కిడ్నీ కోసం చర్చించుకుంటున్న విషయమై నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు వారిని స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారణ జరిపారు. సీఐ సత్యనారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏలూరుకు చెందిన కట్టా రంగబాబు (36), సీహెచ్ యేసురాజు (30) స్నేహితులు. వైజాగ్‌లో ఒక వ్యాన్ ఉందని, దాన్ని తీసుకురావాలని చెప్పి రంగబాబు యేసురాజును తీసుకొచ్చాడు. యేసురాజుకు అనుమానం వచ్చి వ్యాన్ కోసం అని చెప్పి హోటల్‌కు ఎందుకు తీసుకొచ్చావని రంగబాబును ప్రశ్నించగా తన పరిస్థితి బాగోలేదని, కిడ్నీలు అమ్మేద్దామని అనుకుంటున్నట్లు రంగబాబుకు చెప్పాడు. ఈ విషయం ఇంటిలో వారికి చెప్పావా ? అని అడగ్గా అతను చెప్పలేదన్నాడు. వెంటనే రంగబాబు భార్యకు ఫోన్ చేయగా ఆమె మందలించింది. ఇంతలో వారిద్దరి మాటలు విన్న హోటల్ వారు పోలీసులకు సమాచారమిచ్చారు. వారితో ఇతరులు ఎవరూ కలవలేదు. వారు వేరెవరినీ సంప్రతించలేదు. విచారణలో ఎటువంటి అనుమానం రాకపోవడంతో వారిని పంపేశామని సీఐ తెలిపారు.

మహారాజా కో-ఆపరేటివ్ బ్యాంక్ మహాజన సభ

సీతమ్మధార, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ది మహారాజా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ 25వ మహాజన సభ ఆదివారం క్షత్రియ కల్యాణమండపంలో జరిగింది. ఈ సభలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే (మార్చి 31) నా టికి బ్యాంకు రూ.290.39 కోట్ల డిపాజిట్లు, రూ.202.16 కోట్ల రుణాలు, రూ. 492.55 కోట్ల వ్యాపారంతో ఉన్నామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3.23 కోట్ల నికర ఆదాయం వచ్చిందన్నారు. బ్యాంకు మూలధనం రూ. 15.88 కోట్లు, రిజర్వులు, ప్రొవిజన్లు కలిపి రూ.17.29 కోట్లు, నికర విలువ రూ.30.79 కోట్లుగా ఉందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సభ్యుల హర్షామోదాలతో వాటాదారులకు 14 శాతం డివిడెండ్‌ను ప్రకటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పైడా ఎడ్యుకేషనల్ అకాడమీ ఛైర్మన్ పైడా కృష్ణప్రసాద్, గాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వనమాల శ్రీనివాస్, కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీ సర్ కె.శ్యామ్‌కిశోర్, తెలంగాణ నుంచి ఆత్మీయ అతిథులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్యాంక్ ప్రతినిధి

కోళ్ల వ్యర్థాల వార్!

... 5వ పేజీ తరువాయి

అస్మదీయులకు టెండర్లు దక్కేలా అధికారులపై ఒత్తిడి చేయడం పరిస్థితికి అద్దంపట్టినట్టయింది. కూటమి నేతల అండదండలతోపాటు వైసీపీకి చెందిన కొందరు కార్పొరేటర్లు అండదండలతో టెండర్లు తమ చేజారిపోయాయనే బాధలో ఉన్న ఆశావహులు కొందరు చికెన్ వ్యర్థాల తరలింపు నిబంధనల ప్రకారమే జరిగేలా చూడాలని భావించారు. ఇందులో భాగంగా డంపింగ్ యార్డుకు కాకుండా చేపల చెరువులకు వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను పట్టుకుని జీవీఎంసీ, పోలీస్ అధికారులకు అప్పగించడం మొదలుపెట్టారు. పట్టుబడిన వాహనాలను విడిచిపెట్టాలంటూ కూటమికి చెందిన నేతలే అధికారులపై ఒత్తిడి చేస్తుండడంతో అధికారులు డైలామాలో పడుతున్నారు. అయినప్పటికీ పదేపదే చేపల చెరువులకు వెళుతున్న కోళ్ల వ్యర్థాల వాహనాలను పట్టుకుని వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తుండడంతో జీవీఎంసీ అధికారులు నెల రోజులు కిందట చికెన్ వ్యర్థాల కోసం గతంలో పిలిచిన టెండర్లను రద్దు చేశారు. దీనిపై కాంట్రాక్టర్లు కోర్టుకు వెళ్లడంతో జీ వీఎంసీ అధికారుల ఆదేశాలపై స్టే విధించింది.

పాత కాంట్రాక్టర్లే యథావిధిగా..

టెండర్లను రద్దు చేస్తూ జీవీఎంసీ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై కోర్టు స్టే విధించడంతో పాత కాంట్రాక్టర్లే యథావిధిగా తమ జోన్ల పరిధిలో కోళ్ల వ్యర్థాలను సేకరిస్తున్నారు. అదే సమయంలో వైసీపీకి చెందిన చోటా నేత పేరుతో కొందరు వాహనాలను పెట్టుకుని కొన్ని వార్డుల పరిధిలో చికెన్ వ్యర్థాలను సేకరించి, చేపల చెరువులకు తరలించడం ఆరంభించారు. ఇందుకోసం కొందరు కార్పొరేటర్లతోపాటు జీవీఎంసీ అధికారులను కూడా తమకు సహకరించేలా ప్రసన్నం చేసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు నిఘా పెట్టి కోళ్ల వ్యర్థాలను చేపల చెరువులకు తరలించే వాహనాలను పట్టుకుని సమీపంలోని పోలీస్, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడం ప్రారంభించారు. ఇందులో భాగంగానే వారం రోజులు కిందట గాజువాకలో అనధికారికంగా చికెన్ వ్యర్థాలను సేకరించి అనకాపల్లి వైపు వెళుతున్న వాహనాన్ని కొందరు పట్టుకుని గాజువాక డంపింగ్ యార్డులో పెట్టి జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ రోజు రాత్రి 11 గంటల సమయంలో ఆ వాహనాన్ని ఎవరో అక్కడి నుంచి తరలించుకుపోయారు. దీంతో ఆ వాహనాన్ని పట్టుకుని యార్డులో పెట్టినవారు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లడంతో మూడు రోజుల తరువాత సంబంధిత వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ కేసు నమోదు చేశారు. దీంతో మరో వర్గం కోళ్ల వ్యర్థాల సేకరణదారులు తమ వైరివర్గం వాహనాలను శనివారం రాత్రి అనకాపల్లి వద్ద పట్టుకుని ఆ జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అనకాపల్లి తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది మూడు వాహనాలను పట్టుకుని జీవీఎంసీ అధికారులకు అప్పగించగా, వాటిని కాపులుప్పాడ డంపింగ్ యార్డులో ఉంచారు. ఆదివారం ఉదయం మరో రెండు వాహనాలను అనకాపల్లిలో రెవెన్యూ అధికారులు పట్టుకుని జీవీఎంసీ అధికారులకు అప్పగించడంతో వివాదం రాజుకుంది. దీనివెనుక కొందరు కార్పొరేటర్లు హస్తం ఉందని వైసీపీ, టీడీపీ కార్పొరేటర్లు ఆరోపిస్తూ 'టీమ్ జీవీఎంసీ' వాట్సాప్ గ్రూపులో పోస్టులు పెట్టగా, కాదు.. 'మీరే కోళ్ల వ్యర్థాల మాఫియాకు అండదండలు అందిస్తున్నారు' అంటూ మరో వర్గం ఆరోపణలు గుప్పించుకుంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు కార్పొరేటర్లు అయితే దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి, పట్టుబడిన వాహనాలు ఎవరివనే దానితో పాటు దాని వెనుక ఎవరు ఉన్నారనేది కూడా తేల్చేలా పోలీస్ దర్యాప్తునకు ఆదేశించాలంటూ జీవీఎంసీ కమిషనర్‌ను కోరుతూ అదే గ్రూపులో పోస్టింగ్‌లు పెట్టి సవాల్ చేశారు. ఏదిఏమైనా కోళ్ల వ్యర్థాల వ్యవహారం కార్పొరేటర్ల మధ్య వివాదానికి కారణంగా మారడం చర్చనీయాంశంగామారింది. దీనిపై జీవీఎంసీ చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ కిశోర్‌కుమార్ వద్ద ప్రస్తావించగా...ఐదు వాహనాలు తమ ఆధీనంలో ఉన్నాయని, సోమవారం పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

నిధుల సమాచారం ఇవ్వకపోవడం తప్పే..

... 5వ పేజీ తరువాయి

అసంతృప్తి నెలకొందన్నారు. అంతకుమించి జడ్పీటీసీ సభ్యుల మధ్య భేదాభిప్రాయాలు లేవని ఆమె స్పష్టం చేశారు. ఆదివారం తన బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుభద్ర మాట్లాడుతూ తనకు, జడ్పీటీసీ సభ్యులకు మధ్య వివాదం పట్ల కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, 20 మంది వరకు సభ్యులు తనను వ్యతిరేకిస్తున్నారంటూ వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. అయితే జడ్పీకి సంబంధించి నిధుల కేటాయింపు, ఇతర అంశాలపై సభ్యులకు సమాచారం ఇవ్వడంలో కొంత గ్యాప్ చోటుచేసుకుందన్నారు.

ఏటా ఆర్థిక సంఘం నిధుల నుంచి ప్రతి జడ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్యేలకు రూ.20 లక్షల నిధులను కేటాయిస్తున్నామన్నారు. అయితే ఇంకా మిగిలిన నిధులు మండలాల్లో పలు అభివృద్ధి పనులకు కేటాయించేటప్పుడు సంబంధిత మండల జడ్పీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వని విషయం వాస్తవమేన్నారు. దీనిపై సభ్యులు జడ్పీ సమావేశంలో కాకుండా తనను కలిసినప్పుడు అడిగితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. జడ్పీ సాధారణ సమావేశం, స్టాండింగ్ కమిటీ సమావేశం ఒకేరోజు ఏర్పాటు చేయడంపై కొందరు సభ్యులు వ్యతిరేకించారని, ఈ కారణంతోనే ఈ నెల 9న జరిగిన రెండు సమావేశాలను బాయ్‌కాట్ చేస్తున్నట్టు సభ్యులు తనకు ముందే చెప్పారన్నారు. భవిష్యత్తులో ఇక రెండు సమావేశాలు ఒకేరోజు నిర్వహించబోమని సుభద్ర స్పష్టం చేశారు. తనపై అవిశ్వాసం ప్రవేశపెడతారన్న వస్తున్న వదంతుల్లో వాస్తవం లేదన్నారు. గత ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు సాధారణ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, ఇదికూడా సభ్యుల్లో అసంతృప్తికి ఒక కారణమన్నారు. జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు 16 నెలలుగా గౌరవ వేతనాలు బకాయి ఉందని తెలిపారు.

పిడుగుల వాన

... 5వ పేజీ తరువాయి

ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయిన్లు మూసుకుపోయిన చోట నీరు రహదారులపై పెద్దఎత్తున ప్రవహించింది. రైల్వే స్టేషన్ రోడ్డులో నీటి ప్రవాహం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సీతమ్మధారలోని కేఆర్ఎం కాలనీలో మోకాలు లోతులో నీరు ప్రవహించింది. నీటి ప్రవాహ ధాటికి రోడ్లపై పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. ఇవి వర్షంలో కొట్టుకుపోతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. కాలువలు పూడికతో నిండిపోవడం, ఫుట్‌పాత్‌ల ఆక్రమణ వల్ల ఇక్కడ ఈ పరిస్థితి నెలకొంది. కాగా బీచ్ రోడ్డులోని అనేక ప్రాంతాల్లో కురిసిన వర్షంతో ఎరుపు రంగులో మారిన నీరు సముద్రంలో చేరింది. దీన్ని వీడియోలు తీసిన కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. బీచ్ రోడ్డు వెంబడి అనేక ప్రాంతాల్లో ఎర్రని నేలలు ఉండడంతో వర్షపు నీరంతా ఎరుపు రంగులోకి మారి సంద్రంలోకి చేరింది. సీతమ్మధారలో 34 మి.మీ., ధారపాలెంలో 24 మి.మీ. వర్షపాతం నమోదైంది. వారం రోజులుగా ఎండల తీవ్రత, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షంతో కాస్త ఉపశమనం లభించింది.

ముస్సోరిలో శిక్షణకు విశాఖ జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మౌలిక వసతులు కల్పనకు ఉద్దేశించిన ప్రాజెక్టులకు భూసేకరణపై ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో జరిగే మూడు రోజుల శిక్షణకు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ హాజరుకానున్నారు. ఆయనతో పాటు మరో రెండు జిల్లాల జేసీలు కూడా శిక్షణకు వెళుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఐఐఎంలో ఎగ్జిక్యూటివ్ పీహెచ్‌డీ స్కాలర్స్ రెండో బ్యాచ్ ప్రారంభం

విశాఖపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) క్యాంపస్‌లో ఎగ్జిక్యూటివ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్ రెండోబ్యాచ్ ఆదివారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఐఐఎం రాంచీ డైరెక్టర్ ప్రొఫెసర్ దీప్‌కుమార్ శ్రీవాత్సవ మాట్లాడుతూ ఇటువంటి ప్రోగ్రామ్‌లు అమలు చేయడం వల్ల క్యాంపస్ ప్రగతిని ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఎంవీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. చంద్రశేఖర్, అడ్మిషన్స్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ప్రశాంత్ ప్రేమ్‌కుమార్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ అమిత్ శంకర్, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ఎంవీపీ కాలనీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. ఎంవీపీ ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదగదిలికి చెందిన కుంచుమూర్తి మధుబాబు తన అత్త కుంచు మల్లీశ్వరి (56)ను శనివారం రాత్రి వైద్యుని వద్దకు స్కూటర్‌పై తీసుకువెళ్లి తిరిగి ఒంటి గంట ప్రాంతంలో ద్విచక్రవాహనంపై వస్తుండగా, వెంకోజీపాలెం, హనుమంతువాక మధ్య జాతీయ రహదారిపై వ్యాను వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటర్‌పై ఉన్న ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. ఈ క్రమంలో మల్లీశ్వరి పై నుంచి వ్యాను దూసుకుపోవడంతో ఆమె ఘటనా స్థలంలోనే మృతి చెందింది. స్వల్ప గాయాలతో మధుబాబు బయటపడ్డారు. ఏఎస్ఐ ఎస్.ఆదిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏ ప్రభుత్వం వచ్చినా ఎస్సీ, ఎస్టీలపై తప్పని వివక్ష

సిరిపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఎస్సీ, ఎస్టీలపై వివక్ష కొనసాగుతూనే ఉందని భీమ్‌సేవ అధ్యక్షుడు యు.రవి సిద్ధార్థ అన్నారు. ఆదివారం భీమ్‌సేన వెల్ఫేర్ అసోసియేషన్ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు ప్రత్యేక రుణమేళా నిర్వహించి రుణాలు ఇవ్వాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించని నేపథ్యంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 30, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 36, బీరకాయలు 44, ఆనపకాయ 20,కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 44, దొండకాయలు 38, బంగాళ దుంపలు18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 62, అల్లం (పాతది) 46, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోస కాయలు 18, వె ల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 34, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 84, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 32, జామ కాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

కాలువలు మూసేయడంతో రోడ్డు పైకి మురుగు

- అక్రమ కట్టడాలు, ఆక్రమణలను పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు
- వర్షం వచ్చిన ప్రతిసారి స్థానికులకు తప్పని అవస్థలు


కాలువలు మూసేయడంతో వర్షానికి రోడ్డుపైకి చేరిన మురుగు నీరు

వెంకోజీపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కాలువలు మూసేసి కట్టడాలు... కాలువలపైనే నిర్మాణ సామగ్రి ఉంచడం.. వెరసి కాలువల్లో ప్రవహించాల్సిన మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఇదీ 15వ వార్డులోని శివగణేష్ నగర్ కృష్ణమందిరం వద్ద కాలువల దుస్థితి. ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ఇక్కడి కృష్ణమందిరం పక్క నుంచి గెడ్డలో కలవాల్సిన మురుగు నీరు కాలువలపై చెక్కలు అడ్డం రావడం, మరో పక్క ముంతాజ్ హోటల్ వైపు కాలువలు పూర్తిగా మూసుకుపోవడం తో రోడ్డుపై ప్రవహించింది. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇదే మార్గం నుంచి ప్రతిరోజు అనేక మంది చిన్నారులు, విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు వెళుతుంటారు. ఈ మురుగు కారణంగా చుట్టూ తిరిగి తమ గమ్యాన్ని చేరుకోవాల్సిన పరిస్థితి.

అంతేకాకుండా ముంతాజ్ హోటల్‌కు అనుకుని ఉన్న ఇంటిలోకి మురుగు అంతా చేరింది. ఈ విషయమై ఎన్నిసార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా తూ తూ మంత్రంగా వచ్చిన మురుగును తొలగిస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం చూపడం లేదని ఆ ఇంట్లో ఉంటున్న వారు వాపోతున్నారు.

ఎప్పటికప్పుడు ఈ ప్రాంతంలోని కాలువలు శుభ్రం చేయాల్సిన బాధ్యత పారిశుధ్య సిబ్బంది ఉంది. అది వీలు కానప్పుడు సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలి. కానీ మనకెందుకులేయని 15వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు ఉన్నతాధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఎటువంటి ఫిర్యాదులు చేయకపోవడం వలనే వర్షం పడినప్పుడల్లా ఈ సమస్య తలెత్తుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు కాలువలు మూసేసి మరీ కట్టడాలు నిర్మించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని, మరోసారి ఇటువంటి సమస్య తలెత్తకుండా చూడాలని పాదచారులు, వాహనచోదకులు కోరుతున్నారు.

పెదగదిలి జంక్షన్‌లో వరద నీరు

- ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు


పెదగదిలి జంక్షన్‌లో వరద నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఆరిలోవ జూలై 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి పెదగదిలి జంక్షన్ జలమయమైంది. భారీగా వర్షం నీరు చేరడంతో ఈ ప్రాంతం చెరువును తలపించింది. పలు తోపుడు బండ్లు నీటిలో మునిగి పోయాయి, వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురైంది. పెదగదిలి జంక్షన్‌లో గల బస్టాపువద్ద కూడా వరద నీరు చేరింది. దీనివ్ల బస్ షెల్టరులో ఉన్నప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. అలాగే విమ్స్ ఆస్పత్రికి వెళ్లే దారి కూడా వరద నీటితో మునిగిపోయింది. వర్షం వచ్చే ప్రతిసారి ఈప్రాంతం వరద ముంచెత్తుతుంటుంది. నాలుగు వైపుల నుంచి వర్షంనీరు రావడంతో పెదగదిలి జంక్షన్ వరద నీటితో మునిగిపోయింది. ఈ సమస్య ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు, వాహనదారులు మండి పడుతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


నీట మునిగిన దుకాణాలు

వైసీపీ నేతల కనుసన్నల్లో జీపీ, పీపీల ప్రతిపాదనలు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా వీరాంజనేయులుకు టీడీపీ లీగల్ సెల్ ప్రతినిధులు


జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా వీరాంజనేయులుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ లీగల్ సెల్ ప్రతినిధులు

వెంకోజీపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులపై అక్రమ కేసుల విషయంలో టీడీపీకి చెందిన న్యాయవాదులు సమయాన్ని వెచ్చించి పార్టీకి సేవ చేసిన న్యాయవాదులను ప్యానల్‌లో పెట్టుకోకుండా గత ప్రభుత్వంలో పని చేసిన పీపీ, జీపీలను తిరిగి నియామకాల ప్రక్రియ సాగుతోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా వీరాంజనేయులకు టీడీపీ లీగల్ సెల్ ప్రతినిధులు వినతిపత్రం ఇచ్చారు. ఆదివారం మంత్రిని కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అంతేకాకుండా జీవీఎంసీలో నియమించబోయే లీగల్ కౌన్సిల్ సభ్యులలో టీడీపీ న్యాయవాదులకు ప్రాధాన్యం కల్పించాలని మంత్రిని కోరారు. పార్టీ కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న తమను గుర్తించాలని, సముచిత పదవులను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా టీడీపీ న్యాయవాదులకు న్యాయం జరిగేలా చూడాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానం శోభన్‌బాబు, పార్లమెంటరీ ఉపాధ్యక్షులు కర్రి పార్థసారధి, టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.శాంతారాం తదితరులు ఉన్నారు.

మహిళా వసతి గృహాన్ని సందర్శించిన బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ

వెంకోజీపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డు ఇసుకతోటలోని విశాఖ-1 మహిళా బీసీ సంక్షేమ వసతి గృహాన్ని బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ ఆదివారం సందర్శించారు. విద్యార్థినులతో ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? భోజనం, వసతి సౌకర్యం ఎలా ఉందని, ఏమైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాలు, విద్యార్థుల హాజరు పట్టికను ప్రిన్సిపల్ సెక్రటరీ పరిశీలించారు. విద్యార్థినులంతా శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని కోరారు. కార్యక్రమంలో సహాయ బీసీ సంక్షేమ అధికారి ఆర్. కృపారావు, హాస్టల్ వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

రేపటితో స్టీల్‌ప్లాంటులో వీఆర్ఎస్‌కు గడువు పూర్తి

ఉక్కుటౌన్‌షిప్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంటులో ఉద్యోగులు వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారం నాడు చివరి తేది. ఇప్పటి వరకూ సుమారు పదిహేను వందల మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. తొలిసారి వీఆర్ఎస్ ప్రకటిస్తే 1160మంది వరకు ఉద్యోగులు వీఆర్ఎస్ తీసుకున్నారు. ఈసారి ఎంత మందికి వీఆర్ఎస్ ఇస్తారన్నది స్పష్టత లేదు. 15 వరకు దరఖాస్తు చేసుకునేందుకు, 18 వరకు ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉంది

వుడా పార్కులో కెమెరాల ప్రదర్శన


ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు

పెదవాల్తేరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కెమెరా డే పురస్కరించుకుని వాల్తేరు ఫోటోగ్రాఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం వుడా పార్కులో పురాతన కెమెరాల సందర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 1940వ సంవత్సరంలో వాడిన కెమెరాల నుంచి 2025వ సంవత్సరంలో ఉపయోగంలో ఉన్న అత్యాధునిక కెమెరాలు వరకు ఉంచారు. ఈ ప్రదర్శన తిలకించడానికి పెద్ద ఎత్తున కెమెరాలపై ఆసక్తి ఉన్న వారంతా విచ్చేశారు. అలాంటి కెమెరాలతో తమకు గత అనుబంధాన్ని, అనుభవాలను నెమరు వేసుకున్నారు. నిర్వాహకులుగా వ్యవహరించిన వాల్తేర్ ఫోటోగ్రఫీ సొసైటీ ప్రతినిధులను పలువురు సందర్శకులు అభినందించారు. కార్యక్రమంలో వాల్తేరు ఫోటోగ్రఫీ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శుల పీఎన్ సేతు, ఎంవీ శ్రీనివాసరెడ్డి, క్లబ్ సభ్యులు వేణుగోపాలరావు, రామరాజు, జగపతిరాజు, డీవీ రమణ, సన్నీ, ఎస్.శ్రీనివాసరావు, రాము, కిషోర్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జి.తిరుపతిరావు, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జూకు సందర్శకుల తాకిడి


జూలో మోడులను పరిశీలిస్తున్న సందర్శకులు

ఆరిలోవ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల ఆదివారం సందర్శకులతో కిటకిట లాడింది. మధ్యాహ్నం కురిసిన వర్షానికి సందర్శకులు జూ పార్కులో గల షెల్టర్‌లో తల దాచుకున్నారు. జంతువులు, పక్షులను చూసేందుకు వచ్చిన సందర్శకులు మోటుల వద్ద సెల్ఫీలు తీసుకొంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా సందర్శకుల నుంచి సుమారు నాలుగు లక్షల మూడు వేల మూడు వందల రూపాయల ఆదాయం సమకూరిందని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.

ఇటీవల ఎండలు తీవ్రంగా ఉండడంతో అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చారు. మధ్యాహ్నం ఒక్కసారి వర్షం కురవడంతో సందర్శకులు ఇబ్బంది పడ్డారు.


వర్షం రావడంతో జూలోని షెల్టర్‌ను ఆశ్రయించిన సందర్శకులు

15వ వార్డులో చెత్త తరలింపుపై నిర్లక్ష్యం

- ఎమ్మెల్యే వెలగపూడి ఆదేశాలు బేఖాతర్
- వర్షం వస్తే అధ్వానంగా మారుతున్న పరిసరాలు


చెత్తాచెదారంతో నిండిన 15వ వార్డు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రాంతం

వెంకోజీపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వీధుల్లో చెత్తాచెదారాన్ని సక్రమంగా తొలగించకపోవడం వల్ల రోడ్డు పక్కన చెత్త కుప్పలుగా పేరుకుపోతోంది. దీంతో ఈ మార్గంలో నడిచే పాదచారులు, వెళ్లే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు వర్షం పడితే చాలు రోడ్డంతా అధ్వానంగా మారడంతో స్థానికులు అవస్థల ఇంతా అంతా కాదు. గ్రేటర్ పరిధిలోని 15వ వార్డులోని ఉమానగర్, ఇసుకతోట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రాంతంలో ఈ పరిస్థితి నెలకొని ఉంది.

పారిశుధ్య విభాగం సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను తొలగించటం లేదని, రెండు రోజుల కోసారి చెత్త నిల్వలను తొలగిస్తున్నారని, అంతలో వర్షం గాని పడితే తమ ప్రాంతంతో చెత్త చెల్లాచెదురై అధ్వానంగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు.

అలాగే వార్డులోని పాత వెంకోజీపాలెం శ్మశాన వాటిక మార్గంలోనూ వర్షం పడినప్పుడల్లా ఇదే పరిస్థితి నెలకొంటోంది. కొండ ప్రాంతం నుంచి వచ్చే చెత్తాచెదారం అంతా రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇటీవల వార్డులో కూటమి ఏడాది పాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు స్థానికులు పిర్యాదు చేయడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిశోర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహించడం కూడా జరిగింది. అయినా తీరు మారలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చెత్త తొలగింపులో నిర్లక్ష్యం వీడాలని కోరుతున్నారు.

నైపుణ్యాభివృద్ధికీ క్రీడలు దోహదం

- పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు


ఒలింపిక్ డే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే పశ్చిమ గణబాబు, పలువురు క్రీడాకారులు, కోచ్‌లు

బీచ్ రోడ్డు, జూలై 13, (ఆంధ్రజ్యోతి) : క్రీడలు కేవలం శారీరక ధృఢత్వం, వ్యా యామానికి సంబంధించిన అంశంగా కాకుండా నైపుణ్యాభివృద్ధికి సహకరించే సాధనంగా చూడాలని పశ్చి మ నియోజకవర్గ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం బీచ్ రోడ్డు ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద ఒలింపిక్ డే రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ యువకులు క్రీడారంగం వైపే ఎక్కువ శ్రద్ధ చూపించాలన్నారు. ఇందుకోసం సమయం కేటాయించాలని సూచించారు. క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయింస్తుందని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత క్రీడలపై శ్రద్ధ చూపితే వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అవరోధించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ కూడలి వరకు ఒలింపిక్ రన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, కోచ్‌లు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విశాఖపట్నం స్పోర్ట్స్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): 'కలెక్టర్ సార్....జిమ్నాస్టిక్స్ సెంటర్‌ను కాపాడండి' అంటూ ప్ల కార్డులతో చిన్నారుల నిరసన ప్రదర్శన చర్చనీయాంశమైంది. ద ఒలింపిక్ సంఘం ఆదివారం బీచ్‌రోడ్డులో నిర్వహించిన పరుగులో జిమ్నాస్టిక్స్ చిన్నారి క్రీడాకారులు తల్లిదండ్రులతో కలిసి పాల్గొన్నారు. ప్లకార్డులతో ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్సు నుంచి నోవాటెల్ హోటల్ వరకు పరుగు తీసి, అక్కడి జీవీఎంసీ పార్కు వద్ద ప్ల కార్డులు ప్రదర్శించారు. పాండురంగపురంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఇండోర్ హాలులోని జిమ్నాస్టిక్స్ కోచింగ్ కేంద్రాన్ని మల్టీ స్పోర్ట్సుకు అనుగుణంగా తీర్చిదిద్దే నిర్మాణ పనులు చేపట్టారు. 27మీ. పొడవు, 16మీ. వెడల్పు పరిమాణంతో ఉన్న డీఎస్ఏ ఇండోర్ హాలును సగ భాగంలో బ్యాడ్మింటన్, పిన్‌బాల్‌కు అనుగుణంగా కోర్టుల నిర్మాణం జరుగుతోంది. జిమ్నాస్టిక్స్ శిక్షణ, సాధనకు కనీసం 40 మీ. పొడవు, 30 మీ. వెడల్పు పరిమాణం అవసరం. అంతకన్నా తక్కువ చుట్టుకొలతలతో ఉన్న ఈ హాలులోని కొంత భాగాన్ని బ్యాడ్మింటన్, పిన్‌బాల్‌కు కూడా కేటాయించడం వల్ల జిమ్నాస్టిక్స్ శిక్షణ, సాధనకు ప్రతికూలంగా మారుతుందని కొద్దిరోజులుగా చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన చిన్నారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారని, ఫలితాల దిశగా వెళుతున్న జిమ్నాస్టిక్స్ కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

మృత శిశువుకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ ప్రతినిధులు

పెదవాల్తేరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఒక మృత శిశువుకు రెడ్ క్రాస్ ప్రతినిధులు అంత్యక్రియలు నిర్వహించి, మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ నెల 10న మద్దిలపాలెం బస్ డిపో వెనుక చెట్ల మధ్య ఓ నవజాత శిశువును గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసిన విషయం తెలిసిందే. ఈ సమాచారం అందుకున్న ఎంవీపీ పోలీసులు దొండపర్తి-1 సచివాలయ వీఆర్వో కృష్ణచైతన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నవజాత శిశువును కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందజేశారు. అయితే అదేరోజు మధ్యాహ్నం మూడు గంటలకు వీఆర్వో ఇచ్చిన మరో నివేదిక ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన బిడ్డను ఆరు అడుగుల ఉత్తున్న గోడపై నుంచి పడేశారని ప్రాథమికంగా తేల్చినట్టు పోలీసులు తెలిపారు. ఆ శిశువును కేజీహెచ్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆ అనుబంధ నివేదిక ఆధారంగా కేసును ఆల్టర్ చేసిన పోలీసులు ఈ సమాచారాన్ని పెదవాల్తేరులోని జీవీఎంసీ ఆధ్వర్యంలో నడుస్తున్న రెడ్ క్రాస్ హోంలెస్ షెల్టర్ మేనేజర్ మురళీకి సమాచారమిచ్చారు. ఎంవీపీ పోలీసు స్టేషన్ సీఐ మురళీ ఆదేశాల మేరకు అదివారం ఆ మృత శిశువుకు ఎస్ఐ ధనుంజయ నాయుడు, కానిస్టేబుల్ రాజు సమక్షంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

కోట శ్రీనివాసరావు మృతికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సంతాపం

డాబాగార్డెన్స్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విలక్షణ నటుడు, సుదీర్ఘ కాలం తెలుగు సినీ పరిశ్రమలో కొనసాగి అందరి మన్నన పొందిన గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు అని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు కొనియాడారు. ప్రజల హృదయాలలో నటుడిగా సుస్థిర స్థానం పొందారని శ్లాఘించారు. కోట శ్రీనివాసరావు మరణానికి వీఏఫ్ఎస్ తీవ్ర సంతాపం తెలుపుతూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

లలితా పీఠంలో సంకట చతుర్థి నేడు

అక్కయ్యపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సంకట హర చతుర్థి సందర్భంగా సోమవారం సాయంత్రం లలితానగర్‌లోని లలితా పీఠంలో విజయ గణపతికి అభిషేకం, లక్ష్మీగణపతి హోమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. మంగళవారం బహుళ పంచమి సందర్భంగా లలితా కామేశ్వరి దేవి శాకంబరి అమ్మవారుగా భక్తులకు దర్శమిస్తారని చెప్పారు.

కిడ్నీ కోసం ఇద్దరి చర్చ.. విచారించిన పోలీసులు

సీతమ్మధార, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న రోడ్డులో బేకాన్ హోటల్ వద్ద ఇద్దరు కిడ్నీ కోసం చర్చించుకుంటున్న విషయమై ఇటీవల నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ జరిపారు. సీఐ సత్యనారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏలూరుకు చెందిన కట్టా రంగబాబు (36), సీహెచ్ యేసు రాజు (30)లు స్నేహితులు. యేసురాజును రంగబాబు వైజాగ్ తీసుకొచ్చాడు. అనుమానం వచ్చిన యేసు రాజు వ్యాన్ కోసం అని చెప్పి హోటల్‌కు ఎందుకు తీసుకొచ్చావని రంగబాబును ప్రశ్నించగా తన కిడ్నీలు అమ్మేద్దామని అనుకుంటున్నట్టు రంగబాబు చెప్పాడు. వీరిద్దరి మాటలు విన్న హోటల్ వారు పోలీసులకు సమాచారమిచ్చారు. అయితే తమ విచారణలో ఎటువంటి అనుమానం రాకపోవడంతో వారిని వెంటనే పంపేశామన్నారు. విచారణ కొనసాగిస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు.

తప్పులు చేసి జీవితాలు నాశనం చేసుకోవద్దు: సీఐ



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న వన్‌టౌన్ సీఐ దేముడు బాబు

మహారాణిపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలిసో, తెలియకో ఒకసారి చేసిన తప్పులు మళ్లీ చేస్తూ జీవితాలను నాశనం చేసుకోవద్దని, ఇకపై మంచి ప్రవర్తనతో మెలగాలని వన్‌టౌన్ సీఐ జి.దేముడు బాబు హితవు పలికారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చి వారి నడవడికపై సూచనలు చేశారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలను దూరం పెట్టాలని, కుటుంబ సభ్యుల నమ్మకాన్ని పోగొట్టుకోకుండా సమాజంలో మంచి పౌరులుగా మారాలని హితవు పలికారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొంటే పి.డి.చట్టం నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా గొడవలు, కొట్లాటలకు పాల్పడితే తాట తీస్తామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలుగుతామని అందరితో ప్రమాణం చేయించారు. కౌన్సెలింగ్‌లో వన్‌టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు సీఐ హెచ్చరిక



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ సత్యనారాయణ

సీతమ్మధార, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్, ద్వారకానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ జరిగింది. సత్ప్రవర్తనతో మెలగాలని, ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సత్యనారాయణ హెచ్చరించారు.

పెళ్లింట్లో భారీ చోరీ

(5వ పేజీ తరువాయి)

సామగ్రి, ఇతర విలువైన వస్తువులతో పాటు రూ20 లక్షల నగదు, పట్టుచీరలు కనిపించకపోవడంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు గాజువాక క్రైమ్ సీఐ శ్రీనివాస్ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలు వచ్చి వివరాలు సేకరించాయి. అదేవిధంగా సంఘటనా స్థలాన్ని క్రైమ్ డీసీపీ లతామాధురి, ఏసీపీ లక్ష్మణరావుతో పాటు సీసీఎస్ సీఐ కె.రామారావులు పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జోరువానతో ఉపశమనం



సీతమ్మధారలోని ఏఎంజీ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

మురళీనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నాలుగురోజులుగా వేసవిని తలపిస్తూ పెరిగిన ఉష్ణోగ్రతల నుంచి ఆదివారం కురిసిన వానతో ప్రజలు ఉపశమనం పొందారు. ఉదయం 7 గంటల నుంచే ప్రతాపం చూపిన భానుడు మధ్యాహ్నం సమయానికి మబ్బుల్లోకి పోవడంతో వాన ముంచెత్తింది. సెలవు రోజు కావడంతో వర్షం కారణంగా ఎక్కువమందికి ఎలాంటి ఇబ్బందినీ కల్గించలేదు. హైవేల్లో కురిసిన జోరువానతో ఆర్‌అండ్‌బీ జంక్షన్, ఎన్ఏడీ, ఊర్వశిజంక్షన్ ప్రాంతాల్లో, ఒకింత సర్వీసు రోడ్లలో వాహనాలు నెమ్మదించినా, అందరికీ వాన ఉల్లాసాన్నిచ్చింది. కొన్ని చోట్ల పెద్ద పెద్ద వడగళ్లలా కురిసిన వాన గంటలోనే ఆవిరయ్యింది.



చాకలిపేటలో రోడ్డుపై గెడ్డ నీరు

సీతమ్మధార నక్కవానిపాలెం ఏఎంజీ ఆసుపత్రి రోడ్డులో ఆదివారం కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

గెడ్డ పొంగి రోడ్డుపైకి మురుగు నీరు

అక్కయ్యపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 42వ వార్డు చాకలిపేట గెడ్డలో నీరు పొంగి రోడ్డుపైకి వచ్చి ఇళ్లల్లోకి ప్రవేశించింది. దీంతో ఇళ్లలోని వస్తువులు కొట్టుకుపోయాయి. ఆదివారం అకస్మాత్తుగా కురిసిన వర్షానికి గెడ్డ పొంగి ఆ నీరు రోడ్డుపైకి రావడంతో బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గెడ్డలోకి జేసీబీ వెళ్లేందుకు కొద్ది రోజుల క్రితం చాకలిపేట గెడ్డకు ఉన్న గోడ చివరి భాగాన్ని జీవీఎంసీ సిబ్బంది కొట్టడం వల్లే ఆ గెడ్డ నీరు రోడ్డుపైకి వచ్చిందని స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి కొట్టిన గెడ్డ గోడను మళ్లీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు



జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందుకున్న చదరంగం విజేతలతో అతిథులు, నిర్వాహకులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆల్ విశాఖ చెస్ సంఘం, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ నేతృత్వంలో క్యాండిల్ నైట్స్ చెస్ అకాడమీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-15 ఓపెన్, బాలికల చదరంగం పోటీలు ఆదివారం ముగిశాయి. నగరంలోని శివశివాని పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ఈ టోర్నీలో వివిధ జిల్లాల నుంచి 299 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ఏడురౌండ్లలో జరిగిన ఈ పోటీల్లో ఓపెన్ కేటగిరీలో కొల్లా భువన్ (ఎన్టీఆర్ జిల్లా) 6.5 పాయింట్లలో ప్రథమ స్థానం సాధించగా, కోట కల్పక హర్ష కీర్తన, చుక్కా వినీల్ కార్తీక్, తల్లా నిశ్చల్ తలో ఆరు పాయింట్లతో ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాలలో నిలిచారు. బాలికల కేటగిరీలో శ్రావ్యశ్రీ భీమరశెట్టి (అనకాపల్లి) 6.5 పాయింట్లతో ప్రథమ స్థానం సాధించగా, నాగ శివసాయి దివ్య, అఫ్షీన్ మహ్మద్ శ్రీ గురువర్షిణి తలో ఆరు పాయింట్లతో ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాలను దక్కించుకున్నారు. విజేతలుగా నిలిచినవారు నగదు బహుమతులు, ట్రోఫీలను అందుకున్నారు. తొలి నాలుగు స్థానాలలో నిలిచినవారు నవంబరు 2 నుంచి ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయ అండర్-15 చెస్ టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆల్ విశాఖ చెస్ సంఘం కార్యదర్శి మణికంఠరావు తెలిపారు.

సేవలే లక్ష్యంగా పనిచేయాలి



నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న రోటరీ క్లబ్ వైజాగ్ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి

డాబాగార్డెన్స్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని రోటరీ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి సూచించారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో రోటరీ క్లబ్ వైజాగ్ డైమండ్స్ 2025-26సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్.కామేశ్వరరావు, కార్యదర్శిగా కె.మారుతి, కోశాధికారిగా ఎ.ఎన్.గోపాల్ ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా, ఎన్నికల అధికారిగా విచ్చేసిన కల్యాణ్ చక్రవర్తి వీరిచేత ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు చక్కని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పి.శోభన్‌ప్రకాష్, అసిస్టెంట్ గవర్నర్ ఎన్.గాయత్రి కార్యవర్గ సభ్యులను అభినందించారు. నూతన అధ్యక్షుడు కామేశ్వరరావు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.వి.రాజశేఖర్, ఆర్.నీరజ, కామేశ్వరరావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్ సారూ! జిమ్నాస్టిక్స్ సెంటర్‌ను కాపాడండి

» ఒలింపిక్ దినోత్సవ పరుగులో చిన్నారుల వినూత్న నిరసన



ఒలింపిక్ దినోత్సవ పరుగులో ప్లకార్డులతో చిన్నారులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): 'కలెక్టర్ సార్....జిమ్నాస్టిక్స్ సెంటర్‌ను కాపాడండి' అంటూ ప్ల కార్డులతో చిన్నారుల నిరసన ప్రదర్శన చర్చనీయాంశమైంది. ద ఒలింపిక్ సంఘం ఆదివారం బీచ్‌రోడ్డులో నిర్వహించిన పరుగులో జిమ్నాస్టిక్స్ చిన్నారి క్రీడాకారులు తల్లిదండ్రులతో కలిసి పాల్గొన్నారు. ప్ల కార్డులతో ఆక్వా స్పోర్ట్సు కాంప్లెక్సు నుంచి నోవాటెల్ హోటల్ వరకు పరుగు తీసి, అక్కడి జీవీఎంసీ పార్కు వద్ద ప్ల కార్డులు ప్రదర్శించారు. పాండురంగపురంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఇండోర్ హాలులోని జిమ్నాస్టిక్స్ కోచింగ్ కేంద్రాన్ని మల్టీ స్పోర్ట్సుకు అనుగుణంగా తీర్చిదిద్దే నిర్మాణ పనులు చేపట్టారు. 27మీ. పొడవు, 16మీ. వెడల్పు పరిమాణంతో ఉన్న డీఎస్ఏ ఇండోర్ హాలును నగభాగంలో బ్యాడ్మింటన్, పిన్‌బాల్‌కు అనుగుణంగా కోర్టుల నిర్మాణం జరుగుతోంది. జిమ్నాస్టిక్స్ శిక్షణ, సాధనకు కనీసం 40 మీ. పొడవు, 30 మీ. వెడల్పు పరిమాణం అవసరం. అంతకన్నా తక్కువ చుట్టుకొలతలతో ఉన్న ఈ హాలులోని కొంత భాగాన్ని బ్యాడ్మింటన్, పిన్‌బాల్‌కు కూడా కేటాయించడం వల్ల జిమ్నాస్టిక్స్ శిక్షణ, సాధనకు ప్రతికూలంగా మారుతుందని కొద్దిరోజులుగా చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన చిన్నారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారని, ఫలితాల దిశగా వెళుతున్న జిమ్నాస్టిక్స్ కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్‌ను కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. అయినా క్రీడా సదుపాయాల అభివృద్ధి పేరుతో ఆ హాలును బహుళ క్రీడలకు అనుగుణంగా మెరుగుపరిచే చర్యలు విరమించుకునే దాఖలాలు కనిపించకపోవడంతో ఆదివారం ఒలింపిక్ దినోత్సవ రన్‌లో ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. వీరిని చూసిన ఎమ్మెల్యేలు గణబాబు, సుందరపు విజయ్‌కుమార్‌లు చిన్నారుల ఆవేదనను విని తమ వంతు సహాయ సహకారాలందిస్తామన్నారు. జిమ్నాస్టిక్స్ కేంద్రం కుదించే అంశం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టిలో ఉందని, ఆయనతో కలిసి కలెక్టర్‌తో సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిమ్నాస్టిక్స్ సెంటర్‌ను కుదించే చర్యలు చేపట్టడం సరికాదని అభిప్రాయపడ్డారు.

మహారాజా కో-ఆపరేటివ్ బ్యాంక్ మహాజన సభ



మహాజన సభలో మాట్లాడుతున్న బ్యాంక్ ప్రతినిధి

సీతమ్మధార, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ది మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ 25వ మహాజన సభ ఆదివారం క్షత్రియ కల్యాణమండపంలో జరిగింది. ఈ సభలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే (మార్చి 31) నాటికి బ్యాంకు రూ.290.39 కోట్ల డిపాజిట్లు, రూ.202.16 కోట్ల రుణాలు, రూ.492.55 కోట్ల వ్యాపారంతో ఉన్నామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3.23 కోట్ల నికర ఆదాయం వచ్చిందన్నారు. బ్యాంకు మూలధనం రూ.15.88 కోట్లు, రిజర్వులు, ప్రొవిజన్లు కలిపి రూ.17.29 కోట్లు, నికర విలువ రూ.30.79 కోట్లుగా ఉందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సభ్యుల హర్షామోదాలతో వాటాదారులకు 14 శాతం డివిడెండ్‌ను ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పైడా ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ పైడా కృష్ణప్రసాద్, గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వనమాల శ్రీనివాస్, కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శ్యామ్‌కిశోర్, తెలంగాణ రాష్ట్రం నుంచి ఆత్మీయ అతిథులు పాల్గొన్నారు.

నిధుల సమాచారం ఇవ్వకపోవడం తప్పే..

(5వ పేజీ తరువాయి)

అసంతృప్తి నెలకొందన్నారు. అంతకుమించి జడ్పీటీసీ సభ్యుల మధ్య బేదాభిప్రాయాలు లేవని ఆమె స్పష్టం చేశారు. ఆదివారం తన బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుభద్ర మాట్లాడుతూ 20 మంది వరకు సభ్యులు తనను వ్యతిరేకిస్తున్నారంటూ వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. అయితే జడ్పీకి సంబంధించి నిధుల కేటాయింపు, ఇతర అంశాలపై సభ్యులకు సమాచారం ఇవ్వడంలో కొంత గ్యాప్ చోటుచేసుకుందన్నారు. ఏటా ఆర్థిక సంఘం నిధుల నుంచి ప్రతి జడ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్యేలకు రూ.20 లక్షలు కేటాయిస్తున్నామన్నారు. ఇంకా మిగిలిన నిధులు మండలాల్లో అభివృద్ధి పనులకు కేటాయించేటప్పుడు సంబంధిత మండల జడ్పీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వని విషయం వాస్తవమేనన్నారు. దీనిపై సభ్యులు జడ్పీ సమావేశంలో కాకుండా తనను కలిసినపుడు అడిగితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. జడ్పీ సాధారణ సమావేశం, స్టాండింగ్ కమిటీ సమావేశం ఒకేరోజు ఏర్పాటు చేయడాన్ని కొందరు వ్యతిరేకించారని, ఈ కారణంతోనే 9న జరిగిన రెండు సమావేశాలను బాయ్‌కాట్ చేస్తున్నట్టు సభ్యులు తనకు చెప్పారన్నారు. భవిష్యత్తులో రెండు సమావేశాలు ఒకేరోజు నిర్వహించబోమని సుభద్ర స్పష్టం చేశారు. తనపై అవిశ్వాసం ప్రవేశపెడతారని వస్తున్న వదంతుల్లో వాస్తవం లేదన్నారు. సాధారణ నిధులతో చేపట్టిన పనులకు బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, ఇదికూడా అసంతృప్తికి ఒక కారణమన్నారు. జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు 16 నెలలుగా గౌరవ వేతనాలు బకాయి ఉందని తెలిపారు.

బినామీల చేతుల్లోనే రేషన్ డిపోలు!

» పట్టించుకోని పౌరసరఫరాల అధికారులు

» కంచరపాలెం పరిధిలో అద్దెకు కొన్ని డిపోలు



కంచరపాలెంలోని సర్కిల్-1 పౌరసరఫరాల కార్యాలయం

కంచరపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో రేషన్ దుకాణాల్లో బినామీలు రాజ్యమేలుతున్నారు. దశాబ్దాలుగా బినామీల పేరుతో రేషన్ దుకాణాలు నడుస్తున్నా పర్యవేక్షించాల్సిన పౌరసరఫరాల శాఖ (సివిల్ సప్లయిస్) అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. కంచరపాలెం రైతు బజారు సమీపంలో గల పౌరసరఫరాల శాఖ సర్కిల్-1 కార్యాలయంలో సహాయ పౌర సరఫరాల శాఖ అధికారితో అరడజను వరకు ఆర్.ఐ.లు విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా సర్కిల్ పరిధిలోని రేషన్ దుకాణాల ద్వారా పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం, ఇతర సరుకులు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అన్నదానిని నిత్యం పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ సర్కిల్-1 కార్యాలయంలో రేషన్ దుకాణాల తనిఖీని తూతూ మంత్రంగా చేపట్టి బినామీ డీలర్లకు వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు ఘాటుగా వినిపిస్తున్నాయి. అధికారుల అండతో బినామీలు తమ అక్రమ వ్యాపారాన్ని నిరాటంకంగా సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం రేషన్ దుకాణాలను ప్రక్షాళన చేసి ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులను అందించాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంది. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా బినామీ డీలర్లతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్కిల్-1 పరిధిలో జైభారత్,బర్మాక్యాంప్, కప్పరాడ, కంచరపాలెం, కొత్త రెడ్డికంచరపాలెం, కైలాసపురం, మర్రిపాలెం,జ్ఞానాపురం, పూర్ణామార్కెట్, గోపాలపట్టణంతో పాటు ఇతర ప్రాంతాల్లో బినామీ డీలర్లు తమ హవా చూపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టి బినామీలపై చర్యలు తీసుకుని పేదలకు రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలని కార్డుదారులు కోరుతున్నారు.

పిడుగుల వాన

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయిన్లు మూసుకుపోయిన చోట నీరు రహదారులపై పెద్దఎత్తున ప్రవహించింది. రైల్వే స్టేషన్ రోడ్డులో నీటి ప్రవాహం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సీతమ్మధారలోని కేఆర్ఎం కాలనీలో మోకాలు లోతులో నీరు ప్రవహించింది. నీటి ప్రవాహ ధాటికి రోడ్లపై పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. ఇవి వర్షంలో కొట్టుకుపోతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. కాలువలు పూడికతో నిండిపోవడం, ఫుట్‌పాత్‌ల ఆక్రమణ వల్ల ఇక్కడ ఈ పరిస్థితి నెలకొంది. బీచ్ రోడ్డులోని అనేక ప్రాంతాల్లో కురిసిన వర్షంతో ఎరుపు రంగులో మారిన నీరు సముద్రంలో చేరింది. దీన్ని వీడియోలు తీసిన కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. బీచ్ రోడ్డు వెంబడి అనేక ప్రాంతాల్లో ఎర్రని నేలలు ఉండడంతో వర్షపు నీరంతా ఎరుపు రంగులోకి మారి సంద్రంలోకి చేరింది. సీతమ్మధారలో 34 మి.మీ., ధారపాలెంలో 24 మి.మీ. వర్షపాతం నమోదైంది. వారం రోజులుగా ఎండల తీవ్రత, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షంతో కాస్త ఉపశమనం లభించింది.

పోలీస్ శాఖలో వసూల్ రాజాలు!

(5వ పేజీ తరువాయి)

స్పందించి విచారణకు ఆదేశించారు. విచారణలో హెడ్ కానిస్టేబుల్ పలువురు నుంచి ఫోన్ పే ద్వారా డబ్బులు వసూలు చేసినట్టు తేలడంతో ఆయనను ఇటీవల విధుల నుంచి సస్పెండ్ చేశారు. అలాగే కంచరపాలెం వద్ద బెల్ట్ షాపుపై దాడి పేరుతో ఓ కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులు వెళ్లి కొన్ని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడితో పాటు అతనికి మద్యం సరఫరా చేసిన మద్యం దుకాణం నిర్వాహకులను బెదిరించి డబ్బులు వసూలు చేసినట్టు తెలిసింది. అనంతరం యథావిధిగా ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి కేసు నమోదు చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. కాగా సీజ్ చేసిన మద్యం సీసాల్లో సగం బాటిళ్లను సిబ్బంది పక్కన పెట్టి, మిగిలిన సగం సీసాలనే సీజ్ చేసినట్టు రికార్డుల్లో చూపడంతో బాధితులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై విచారణ జరిపిన సీపీ.. బాధితుల ఆరోపణలు నిజమేనని తేలడంతో ముగ్గురినీ విధుల నుంచి సస్పెండ్ చేస్తూ రెండు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారు. భీమిలిలో ఇటీవల పోలీసులు ఒక బెల్ట్ షాప్‌పై దాడి చేసి 123 మద్యం సీసాలను పట్టుకున్నారు. గ్రామంలో జాతర కోసం మద్యం కొనుగోలు చేసుకున్నామని చెప్పినాసరే...నిబంధనలకు విరుద్ధంగా భారీగా మద్యం నిల్వ ఉండడంతో బెల్ట్ షాపుగానే భావించి పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే స్వాధీనం చేసుకున్న 123 సీసాల్లో కేవలం 58 బాటిళ్లను మాత్రమే సీజ్ చేసినట్టు చూపించిన పోలీసులు, మిగిలిన మద్యం సీసాలను ఏం చేశారనే దానిపై మద్యం దుకాణం నిర్వాహకులతోపాటు బెల్ట్ షాప్ కేసులో అరెస్టయిన బాధితుడు సిబ్బందిని ప్రశ్నించారు. అంత పెద్దసంఖ్యలో మద్యం సీసాలు దొరికనట్టు చూపిస్తే పెద్ద కేసు అయిపోతుందని పోలీసులు బెదిరించడంతో వారంతా కిమ్మనకుండా ఉండిపోయారు. తాజాగా శనివారం గోపాలపట్నం లక్ష్మీనగర్‌లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేసి కొన్ని మద్యం సీసాలను సీజ్ చేసి స్టేషన్‌కు తీసుకువచ్చారు. కానీ స్టేషన్‌లో కీలకంగా వ్యవహరించే ఓ హెడ్ కానిస్టేబుల్ సీజ్ చేసిన మద్యంలో సగానికి పైగా సీసాలను పక్కన పెట్టేసి మిగిలినవి మాత్రమే సీజ్ చేసినట్టు చూపించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. నగరంలో ఈ తరహా ఘటనలు ప్రతిరోజూ జరుగుతున్నాయని పలువురు మద్యం వ్యాపారులు చెబుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సీపీ శంఖబ్రత బాగ్చి ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో సిబ్బంది, అధికారుల పనితీరుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయకపోతే పోలీస్ శాఖ ప్రతిష్ఠ మసకబారడం ఖాయమని ఆ శాఖకు చెందిన పలువురు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్‌లో మెస్ చార్జీలు

(5వ పేజీ తరువాయి)

వెండర్స్ సరకులు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదని పేర్కొంటున్నారు. ఈ తరహా ఇబ్బందులు నిత్యం పరిపాటిగా మారడంతో తమకు అవస్థలు తప్పడం లేదని పలువురు వార్డెన్లు వాపోతున్నారు.

11 నెలలుగా కాస్మోటిక్ చార్జీలు పెండింగ్..

విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను కూడా గడిచిన 11 నెలల నుంచి చెల్లించలేదు. వసతిగృహాల్లో ఉండే విద్యార్థుల కాస్మోటిక్ అవసరాల కోసం ప్రభుత్వం కొంత మొత్తం చొప్పున చెల్లిస్తోంది. పోస్టు మెట్రిక్ హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులకు రూ.210 నుంచి రూ.250, ప్రీ మెట్రిక్ హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులకు నెలకు రూ.110 నుంచి రూ.160 వరకు చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే చివరిసారిగా కాస్మోటిక్ చార్జీలను గడిచిన ఏడాది ఆగస్టులో చెల్లించినట్టు తెలుస్తోంది. 11 నెలల నుంచి కాస్మోటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు తల్లిదండ్రులే వారికి అవసరమైన కాస్మోటిక్ వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలను తక్షణమే చెల్లించాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఒక్కో విద్యార్థికి రూ.1,200 నుంచి రూ.1,700 వరకు ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలను చెల్లించాల్సి ఉంది.

కోళ్ల వ్యర్థాల వార్!

(5వ పేజీ తరువాయి)

అస్మదీయులకు టెండర్లు దక్కేలా అధికారులపై ఒత్తిడి చేయడం పరిస్థితికి అద్దంపట్టినట్టయింది. కూటమి నేతల అండదండలతోపాటు వైసీపీకి చెందిన కొందరు కార్పొరేటర్ల అండదండలతో టెండర్లు తమ చేజారిపోయాయనే బాధలో ఉన్న ఆశావహులు కొందరు చికెన్ వ్యర్థాల తరలింపు నిబంధనల ప్రకారమే జరిగేలా చూడాలని భావించారు. ఇందులో భాగంగా డంపింగ్ యార్డుకు కాకుండా చేపల చెరువులకు వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను పట్టుకుని జీవీఎంసీ, పోలీస్ అధికారులకు అప్పగించడం మొదలుపెట్టారు. పట్టుబడిన వాహనాలను విడిచిపెట్టాలంటూ కూటమికి చెందిన నేతలే అధికారులపై ఒత్తిడి చేస్తుండడంతో అధికారులు డైలామాలో పడుతున్నారు. అయినప్పటికీ పదేపదే చేపల చెరువులకు వెళుతున్న కోళ్ల వ్యర్థాల వాహనాలను పట్టుకుని వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తుండడంతో జీవీఎంసీ అధికారులు నెల రోజులు కిందట చికెన్ వ్యర్థాల కోసం గతంలో పిలిచిన టెండర్లను రద్దు చేశారు. దీనిపై కాంట్రాక్టర్లు కోర్టుకు వెళ్లడంతో జీ వీఎంసీ అధికారుల ఆదేశాలపై స్టే విధించింది.

పాత కాంట్రాక్టర్లే యథావిధిగా..

టెండర్లను రద్దు చేస్తూ జీవీఎంసీ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై కోర్టు స్టే విధించడంతో పాత కాంట్రాక్టర్లే యథావిధిగా తమ జోన్ల పరిధిలో కోళ్ల వ్యర్థాలను సేకరిస్తున్నారు. అదే సమయంలో వైసీపీకి చెందిన చోటా నేత పేరుతో కొందరు వాహనాలను పెట్టుకుని కొన్ని వార్డుల పరిధిలో చికెన్ వ్యర్థాలను సేకరించి, చేపల చెరువులకు తరలించడం ఆరంభించారు. ఇందుకోసం కొందరు కార్పొరేటర్లతోపాటు జీవీఎంసీ అధికారులను కూడా తమకు సహకరించేలా ప్రసన్నం చేసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు నిఘా పెట్టి కోళ్ల వ్యర్థాలను చేపల చెరువులకు తరలించే వాహనాలను పట్టుకుని సమీపంలోని పోలీస్, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడం ప్రారంభించారు. ఇందులో భాగంగానే వారం రోజులు కిందట గాజువాకలో అనధికారికంగా చికెన్ వ్యర్థాలను సేకరించి అనకాపల్లి వైపు వెళుతున్న వాహనాన్ని కొందరు పట్టుకుని గాజువాక డంపింగ్ యార్డులో పెట్టి జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ రోజు రాత్రి 11 గంటల సమయంలో ఆ వాహనాన్ని ఎవరో అక్కడి నుంచి తరలించుకుపోయారు. దీంతో ఆ వాహనాన్ని పట్టుకుని యార్డులో పెట్టినవారు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లడంతో మూడు రోజుల తరువాత సంబంధిత వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ కేసు నమోదు చేశారు. దీంతో మరో వర్గం కోళ్ల వ్యర్థాల సేకరణదారులు తమ వైరివర్గం వాహనాలను శనివారం రాత్రి అనకాపల్లి వద్ద పట్టుకుని ఆ జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అనకాపల్లి తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది మూడు వాహనాలను పట్టుకుని జీవీఎంసీ అధికారులకు అప్పగించగా, వాటిని కాపులుప్పాడ డంపింగ్ యార్డులో ఉంచారు. ఆదివారం ఉదయం మరో రెండు వాహనాలను అనకాపల్లిలో రెవెన్యూ అధికారులు పట్టుకుని జీవీఎంసీ అధికారులకు అప్పగించడంతో వివాదం రాజుకుంది. దీనివెనుక కొందరు కార్పొరేటర్ల హస్తం ఉందని వైసీపీ, టీడీపీ కార్పొరేటర్లు ఆరోపిస్తూ 'టీమ్ జీవీఎంసీ' వాట్సాప్ గ్రూపులో పోస్టులు పెట్టగా, కాదు.. 'మీరే కోళ్ల వ్యర్థాల మాఫియాకు అండదండలు అందిస్తున్నారు' అంటూ మరో వర్గం ఆరోపణలు గుప్పించుకుంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు కార్పొరేటర్లు అయితే దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి, పట్టుబడిన వాహనాలు ఎవరివనే దానితోపాటు దాని వెనుక ఎవరు ఉన్నారనేది కూడా తేల్చేలా పోలీస్ దర్యాప్తునకు ఆదేశించాలంటూ జీవీఎంసీ కమిషనర్‌ను కోరుతూ అదే గ్రూపులో పోస్టింగ్‌లు పెట్టి సవాల్ చేశారు. ఏదిఏమైనా కోళ్ల వ్యర్థాల వ్యవహారం కార్పొరేటర్ల మధ్య వివాదానికి కారణంగా మారడం చర్చనీయాంశంగామారింది. దీనిపై జీవీఎంసీ చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ కిశోర్‌కుమార్ వద్ద ప్రస్తావించగా... ఐదు వాహనాలు తమ ఆధీనంలో ఉన్నాయని, వీటిపై సోమవారం పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

ప్రజా సేవే శ్వాసగా కూటమి ప్రభుత్వ పనితీరు

» మేయర్ పీలా శ్రీనివాస్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు » 65, 71, 86 వార్డుల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు



71వ వార్డు ఆటోనగర్‌లో తాగునీటి పైప్‌లైన్లకు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాస్

ఆటోనగర్/ కూర్మన్నపాలెం/ పెదగంట్యాడ : జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సేవే శ్వాసగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి పలు ప్రణాళికలను అమలు చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాస్ అన్నారు. జీవీఎంసీ 86వ వార్డు చినయాతపాలెంలో 94.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులతో పాటు పలు అభివృద్ధి పనులకు, జీవీఎంసీ 65వ వార్డులో సుమారు రూ.ఐదు కోట్లతో, 71వ వార్డు ఆటోనగర్‌లో సుమారు రూ.49.60 లక్షలతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ల అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో వారు మాట్లాడుతూ.. గత 5 ఏళ్ల వైసీపీ పాలనతో ప్రజలు విసిగి పోయారనీ, అభివృద్ధిలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి పోయిందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. 4 దశాబ్దాలుగా ఆటోనగర్, తోకాడతో పాటు పలు పరిశ్రమల్లో తాగునీరు పైపులైన్లు మరమ్మతుకు గురి కావడంతో తక్షణమే అభివృద్ధి పనులు చేయిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం విశాఖ నగరాభివృద్ధికి విశేష కృషి చేస్తోందన్నారు. గాజువాకను అభివృద్ధి పథంలో పరుగులు తీయిస్తామన్నారు.ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామన్నారు. ఆటోనగర్, తోకాడ కాలనీల మహిళలు తమ కాలనీలలో రహదారులు,డ్రైనేజీలు శిథిలావస్థకు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామనీ, వర్షాకాలంలో అవస్థలకు గురి అవుతున్నామని మేయర్, ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు వివరించారు. తక్షణమే వాటి సమస్య పరిష్కరించేలా చర్యలు చేపడతామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజాన రామారావు, టీడీపీ రాష్ట్ర పరిశీలకులు పప్పు రాజారావు, నాయకులు పప్పు శంకరరావు, బొడ్డేడ నాయుడు, రామచంద్రరావు, ప్రతాపరావు శ్రీనివాసరావు, అన్నెంరెడ్డి అన్నపూర్ణ, రాజారావు, 65వ వార్డుకు సంబంధించి కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, గంధం శ్రీనివాసరావు, టీడీపీ 65వ వార్డు టీడీపీ అధ్యక్షుడు రట్టి వాసు, మహిళా కమిటీ అధ్యక్షురాలు స్వరూపారాణి, కూటమి నాయకులు రెయ్యి రత్నం, సిగటాపు సుజాత, జగదీష్, సింగంపల్లి దేముడు తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో భారీ వర్షం

» పలు ప్రాంతాలు జలమయం » వాహనాల రాకపోకలు తప్పని ఇబ్బందులు



కణితి రోడ్డులో నిలిచిన వర్షం నీరు



సింహగిరి కాలనీ రోడ్డులో రోడ్డుపైకి చేరిన చెత్త

గాజువాక, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడిన ప్రజలు ఆదివారం కురిసిన భారీ వర్షానికి సేదతీరారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గాజువాకలో ఎండగా ఉండడంతో ప్రజలు అల్లాడిపోయారు. ఈ సమయంలో వర్షం పడడంతో ప్రజలు కాస్త ఉపసనం పొందారు.పలు ప్రాంతాలను వర్షం నీరు ముంచెత్తింది. దీంతో రోడ్లు జలమయమై కొంత సేపు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. గాజువాక సింహగిరి కాలనీలో చెత్తను తొలగించకపోవడంతో ఆదివారం కురిసిన వర్షానికి రోడ్డంతా చెత్తచెదారంగా నిండిపోయింది. దీంతో ఈ మార్గమంతా దుర్గంధభరితంగా మారింది.

నైపుణ్యాభివృద్ధికీ క్రీడలు దోహదం

» పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు



ఒలింపిక్ డే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే పశ్చిమ గణబాబు, పలువురు క్రీడాకారులు, కోచ్‌లు

బీచ్ రోడ్డు, జూలై 13, (ఆంధ్రజ్యోతి) : క్రీడలు కేవలం శారీరక దృఢత్వం, వ్యాయామానికి సంబంధించిన అంశంగా కాకుండా నైపుణ్యాభివృద్ధికి సహకరించే సాధనంగా చూడాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం బీచ్ రోడ్డు ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద ఒలింపిక్ డే రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ యువకులు క్రీడారంగం వైపే ఎక్కువ శ్రద్ధ చూపించాలన్నారు. ఇందుకోసం సమయం కేటాయించాలని సూచించారు. క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత క్రీడలపై శ్రద్ధ చూపితే వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అవరోధించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ కూడలి వరకు ఒలింపిక్ రన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, కోచ్‌లు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి అవిశ్రాంత పోరాటం : సీఐటీయూ నేత జగ్గునాయుడు

అక్కిరెడ్డిపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కార్మిక సంక్షేమానికి విశేష కృషి చేస్తామని, కార్మికుల హక్కు కోసం పోరాటాలు చేస్తామని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.జగ్గునాయుడు అన్నారు. అక్కిరెడ్డిపాలెం కళాభారతి కల్యాణ మండపంలో ఆదివారం గాజువాక జోన్ సీఐటీయూ పదో మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్రం చూస్తోందని, దీన్ని సీఐటీయూ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ప్లాంటులో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, కనీస వేనాలు అమలు చేయాలని, జీవీఎంసీ కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.రమణ, ప్రధాన కార్యదర్శిగా బంగారు నాయుడు, కోశాధికారిగా ఎ.లోకేశ్వరరావులతో పాటు మరికొంత మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కెఎం.శ్రీనివాసరావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

76వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా అప్పలరాజు



అప్పలరాజు



వెంకటరావు

పెదగంట్యాడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 76వ వార్డు టీడీపీ నూతన అధ్యక్షుడుగా జిత్తుక అప్పలరాజు, కార్యదర్శిగా కూన వెంకటరావు నియమితులయ్యారు. గాజువాక నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిపినట్టు పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ పార్టీని మరింత పటిష్ఠంగా తయారు చేసేందుకు కృషి చేయాలని నియామక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శ్మశానవాటికలో శ్రమదానం

అక్కిరెడ్డిపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 69వ వార్డు కాపు తుంగ్లాంలోని శ్మశానవాటికలో స్థానిక యువకులు ఆదివారం శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. శ్మశానంలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. శ్మశానవాటికను పరిశుభ్రంగా ఉంచాలని ఈ సందర్భంగా స్థానిక పెద్దలు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు సలాది అచ్చిబాబు, గుండు రామారావు, విరోతి భవాని శంకర్, దుర్గాప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు అగనంపూడిలో 'సుపరిపాలన'

అగనంపూడి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79 వార్డు పరిధిలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ తెలిపారు.

అనాథశ్రమాన్ని సందర్శించిన విజ్ఞాన్ విద్యార్థులు



అనాథ ఆశ్రమం సందర్శించిన విద్యార్థినులు

అగనంపూడి, జూలై 13(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలోని సీఈఎస్ విభాగం ఆధ్వర్యంలో చాంపియన్స్ ఆఫ్ సాఫ్‌వేర్ ఇంజనీంగ్ అక్షయ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు ఆదివారం స్థానికంగా గల మానసు అనాథశ్రమాన్ని సందర్శించారు. చిన్నారులతో సరదగా గడిపారు. వారితో మమేకమై ఆటపాటలో ఆనందాన్ని పంచుకున్నారు. వారికి అవసరమైన పుస్తకాలు. ఆటవస్తువులను అందజేశారు. ప్రిన్సిపాల్ అరుంధతి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. సమాజంపై బాధ్యతాయుతంగా మెలిగేందుకు ఇటువంటి సేవలు ఎంతగానో స్ఫూర్తినిస్తాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రేపటితో స్టీల్‌ప్లాంటులో వీఆర్‌ఎస్‌కు గడువు పూర్తి

ఉక్కుటౌన్‌షిప్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంటులో ఉద్యోగులు వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారం నాడు చివరి తేదీ. ఇప్పటి వరకూ సుమారు పదిహేను వందల మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. తొలి సారి వీఆర్‌ఎస్ ప్రకటిస్తే 1160మంది వరకు ఉద్యోగులు వీఆర్‌ఎస్ తీసుకున్నారు. ఈ సారి ఎంత మందికి వీఆర్‌ఎస్ ఇస్తారన్నది స్పష్టత లేదు. 15 వరకు దరఖాస్తు చేసుకునేందుకు, 18 వరకు ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉంది

పలు వార్డుల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'



కూటమి పాలనపై ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

పెదగంట్యాడ/ కూర్మన్నపాలెం జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఏడాది సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పెదగంట్యాడ టీడీపీ నాయకులు ఆదివారం వివిధ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. జీవీఎంసీ 75వ వార్డు, 86 వార్డు వుడా నగర్, 87 వార్డు శ్రీగణేష్ నగర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖ పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, 75వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నమ్మి అప్పారావు, ప్రధానకార్యదర్శి ములకలపల్లి పెంటయ్య, టీడీపీ 86 వార్డు టీడీపీ అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ ఈ కార్యక్రమాలకు ఆయా ప్రాంతాల్లో సారధ్యం వహించారు. సీతానగరం, నెల్లి ముక్కు, ఎస్సీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ప్రభుత్వ పనితీరును వారినిఅడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ నాయకులు గోక్యాడ ముత్యాలు, పెదగంట్యాడ టీడీపీ నాయకులు ఉరుకూటి అప్పలరాజు, కణితి సన్యాసమ్మ,ఉరుకూటి అప్పారావు, టి.అప్పారావు పాల్గొన్నారు.

శ్రీపెంటమాంబ క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-4 ప్రారంభం

పెదగంట్యాడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీపెంటమాంబ క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-4 ఆదివారం 75వ వార్డు జీవీఎంసీ మైదానంలో ప్రారంభమైంది. తమస్నేహితుల జ్ఞాపకార్థం నెల్లిముక్కు శెట్టిబలిజ యూత్ సంక్షేమ సంఘం సభ్యులు ఈ క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-4ను నిర్వహిస్తున్నారు. విశాఖ పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. నెల్లిముక్కు శెట్టిబలిజ యూత్ సంక్షేవ సంఘం సభ్యులు, పలువురు క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి

అగనంపూడి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రేణులంతా పార్టీ కోసం మరింత నిబద్ధతతో పనిచేయాలని 85 వార్డు టీడీపీ పరిశీలకులు కె.శ్రీనివాసవర్మ సూచించారు. ఆదివారం పెదమడకలో ఏర్పాటు చేసిన టీడీపీ నూతన కమిటీ ప్రతినిధులు, శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి నూతన కమిటీ ప్రతినిధులు కృషి చేయాలన్నారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 30, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 36, బీరకాయలు 44, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 44, దొండకాయలు 38, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 62, అల్లం (పాతది) 46, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 34, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 84, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

పూడికతో మూసుకుపోయిన చెరువులు

» వర్షాలు కురుస్తున్నా కానరాని నీటి జాడ



పచ్చిక బయలను తలపిస్తున్న చంద్రనగర్ ఎర్రచెరువు

గోపాలపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధి 89వ వార్డులోని చెరువులు దశాబ్దాల కాలంగా ఆధునికీకరణకు నోచుకోక దుర్భరంగా కనిపిస్తున్నాయి. వార్డులోని నాగేంద్రకాలనీ నుంచి సంతోష్‌నగర్ కాలనీ వరకూ సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద చెరువు ఉంది. కొత్తపాలెం నుంచి చంద్రనగర్ మధ్యలో సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ఎర్రచెరువు ఉంది. గ్రామంలో సహజసిద్ధంగా దశాబ్దాల క్రితం నుంచి ఉన్న చెరువులు అభివృద్ధికి నోచుకోపోవడంతో వీటిలో సుమారు 20 శాతం ఆక్రమణకు గురయ్యాయి. చెరువులు అభివృద్ధి చేయకపోవడంతో నాగేంద్రకాలనీకి ఆనుకుని ఉన్న పెద్ద చెరువు చిట్టడవిని తలపిస్తోంది. ఎర్రచెరువు పూడికతో నిండి పచ్చికబయలులా మారింది. దీంతో వర్షాలు కురిసినా చెరువులో నీటి నిల్వలు లేక ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. చెరువుల్ని అభివృద్ధి చేస్తామని అధికారులు, నేతలు రూపొందించిన ప్రతిపాదనలు దశాబ్దాలు గడుస్తున్నా కార్యరూపం దాల్చడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూడికతో నిండిపోయిన ఈ చెరువుల్ని ఇప్పటికైనా బాగుచేయించాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీరామ్‌నగర్ కాలనీలో చోరీ

» నాలుగు తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు మాయం

లంకెలపాలెం, జూలై 13 (ఆంధ్రజోతి): తాళం వేసి ఉన్న ఓ ఇంట్లోకి దొం గలు చొరబడి బంగారం, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. జీవీఎంసీ 85వ వార్డు పరిధి లంకెలపాలెం శివారులో ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలివి. శ్రీరామ్‌నగర్ కాలనీలో డొం కాడ విమలకుమారి తన భర్త మరణించడంతో అద్దె ఇంట్లో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. చిన్న కుమారుడు శివకుమార్ దుబాయ్‌లో ఉండగా, పెద్ద కుమారుడు సంతోశ్‌కుమార్ అదే కాలనీలో కూతవేటు దూరంలో కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. విమల కుమారి శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి పెద్ద కుమారుడు ఇంటికి వచ్చారు. తిరిగి ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వెళ్లి చూడగా, ప్రధాన ద్వారంతోపాటు బెడ్‌రూమ్ తలుపులు తాళాలు విరగ్గొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన నాలుగు తులాలు బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లినట్టు గుర్తించారు. వెంటనే ఆమె పరవాడ పోలీసులు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించింది. పరవాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్షరాస్యతపై యువతకు శిక్షణ



మాట్లాడుతున్న బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు

పెందుర్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పెందుర్తిలో కైట్స్ స్కిల్స్ డెవలప్‌మెంట్ సంస్థలో ఆదివారం ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యా వికాసం కేంద్ర నిర్వాహకులు యువతకు శిక్షణ ఇచ్చారు విద్య, సంప్రదాయం, అక్షరాస్యత పెంపు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు మాట్లాడుతూ విద్యావికాస కేంద్రాలతో గ్రామాల్లో శతశాతం అక్షరాస్యత సాధ్యమవుతుందన్నారు. జిల్లాలోని 30 గ్రామాల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని నిర్వాహకులు తెలిపారు. ఉపాధ్యాయిని శేషుమాంబ, ప్రాజెక్ట్ మేనేజరు ప్రశాంత్ పాల్గొన్నారు.

కూటమి నేతల మాటలు ప్రజలు నమ్మరు: విజయప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నేత మళ్ల విజయప్రసాద్

మల్కాపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు గ్రహించారని, ఎన్ని నాటకాలాడినా వారిని ఏకీభవించే అవకాశం లేదని పశ్చిమ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 58వ వార్డు శ్రీహరిపురంలో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో కూటమి నేతలు చేపట్టినది మోసపూరితమని ప్రజలతో పాటు ఆ కార్యక్రమానికి వెళ్తున్న నాయకులకు కూడా తెలుసునని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే పరిస్థితి ఎంతమాత్రం లేదన్నారు. వైసీపీ సీనియర్ నాయకుడు గులిగిందల కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్పొరేటర్ గులిగిందల లావణ్య, నాయకులు పాల్గొన్నారు.

వర్షంతో ఊరట



నిర్మానుష్యంగా గోపాలపట్నంలోని బంక్ కూడలి

గోపాలపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా తీవ్ర ఎండలతో సతమతమైన ప్రజలు ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ఊరట చెందారు. వర్షాకాలం సమీపించినప్పటికీ నాలుగు రోజుల నుంచి అసాధారణమైన ఎండ వేడిమితో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మార్పు చెంది ఓ మోస్తరు వర్షం కురవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ముప్పు నివారణకు పూడికతీత పనులు

భారీ వర్షం కురిస్తే గోపాలపట్నం కొండవాలు ప్రాంతాల నుంచి వచ్చే వర్షం నీటితో కొత్తపాలెం గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రాలు, లతోట్టు ప్రాంతాలు జలమయమవుతాయి. గెడ్డల ఆధునికీకరణ జరగకపోవడంతో కొండవాలు నుంచి వచ్చే వరదనీటి ప్రవాహంతో లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్య నెలకొంటుంది. వర్షాకాలం సమీపించడంతో శివారు ప్రాంతాల్లో వరదనీరు నిల్వ కాకుండా కొత్తపాలెం శివారులోని గెడ్డల్లో పూడికతీత పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురవకపోవడంతో ముంపు సమస్య తలెత్తలేదు. భారీ వర్షాలు కురిస్తే సమస్య ఎలా ఉంటుందనేది ముందు చూడాలి.

పెచ్చుమీరితే నగర బహిష్కరణ : సీఐ హెచ్చరిక



పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కె.వి.సతీశ్‌కుమార్

పెందుర్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుండా సంఘ వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే నగర బహిష్కరణ తప్పదని సీఐ కె.వి.సతీశ్‌కుమార్ హెచ్చరించారు. పెందుర్తి పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ ప్రతి ఆదివారం పోలీసు స్టేషన్‌లో హాజరవ్వాలన్నారు. పంచాయితీలు నిర్వహించడం, సెటిల్మెంట్లకు పాల్పడడం, రౌడీ కార్యకలాపాలు చేపట్టడం లాంటివి చేస్తే జైలుకు పంపుతామని స్పష్టంచేశారు. అసాంఘిక కార్యక్రమాలు హెచ్చుమీరితే పీడీ చట్టం ప్రయోగిస్తామన్నారు. సత్ప్రవర్తనతో మెలిగి కుటుంబంతో ఆనందంగా జీవించాలన్నారు. లేదంటే జీవితాంతం జైల్లో మగ్గాల్సిందేనన్నారు.

కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో వైభవంగా శ్రవణా నక్షత్రం పూజలు

వేపగుంట జూలై 13 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవినగర్ శేషాద్రిపై కొలువైన కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రవణా నక్షత్రం పూజలు నిర్వహించారు. ఆలయంలో తెల్లవారుజామున పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనల అనంతరం అలంకరించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎల్.జి. పాలిమార్స్ దరి నందమూరినగర్ వాసులు మోహన్‌రెడ్డి-నందిని, సన్యాసిరావు-అనిత దంపతులు, కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. వీరికి అర్చకులు శ్రీనివాస స్వామి వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, కృష్ణమూర్తి, సన్యాసిరావు, రాజేంద్ర, శ్రీహరి పాల్గొన్నారు.

వేపగుంటలో నేడు సుపరిపాలన తొలిఅడుగు

వేపగుంట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వేపగుంట ముత్యమాంబకాలనీలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు తెలియజేశారు. ముఖ్యఅతిథిగా మేయర్ పీలా శ్రీనివాసరావు, పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండిబాబ్జీలు పాల్గొని ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తారని పేర్కొన్నారు.

సర్కారు భూమికి రక్షణ కల్పించాలి: గనిశెట్టి కనకరాజు



వివరాలు తెలియజేస్తున్న సర్పంచ్ భర్త గనిశెట్టి కనకరాజు

పెందుర్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చింతగట్ల పంచాయతీ పరిధిలోని ఇప్పినివానిపాలెంలో వున్న సర్వే నంబర్ 81-2లో మిగిలిన ఆరెకరాల ప్రభుత్వ భూమి పరాధీనం కాకుండా ఉన్నతాధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని చింతగట్ల సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి భర్త కనకరాజు కోరారు. చింతగట్లలో ప్రభుత్వ భూమి కొట్టేసేందుకు స్కెచ్‌పై పత్రికల్లో వచ్చిన కథనాలపై ఎంపీటీసీ నందవరపు అప్పలరాజు, కొంతమంది స్థానికులతో కనకరాజు ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఇక్కడి ప్రభుత్వ భూమికి సర్వే నిర్వహించి ఓ వ్యక్తి పేరిట ఎల్‌పీఎం నెంబర్ కేటాయించి, అతనికి రద్దయిన డీపట్టా భూమిని ఇదే స్థలంలో చూపించి రూ.20 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కొట్టేసేందుకు అక్రమార్కులు కుట్రకు తెర తీశారని ఆరోపించారు. దీని వెనక రాజకీయ శక్తులపై విచారణ చేయాలని, ఇందులో రెవెన్యూ సిబ్బంది సహకారం ఉందన్నారు. గతంలో ఇదే స్థలంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తే ప్రభుత్వ భూమి ఆక్రమణ అంటూ అడ్డుపడి గగ్గోలు పెట్టి వివాదం సృష్టించిన కొందరు నేతలు ఇప్పుడు ప్రభుత్వ భూమిని అప్పనంగా కట్టబెట్టేందుకు యత్నిస్తున్నా అడ్డుపడకుండా మిన్నకుండిపోయారని ఆరోపించారు. చింతగట్లలోని ప్రభుత్వ భూమి పరాధీనం కాకుండా పోరాటం చేస్తానన్నారు.

భార్య దూరమైందని మనస్తాపంతో ఆత్మహత్య

మల్కాపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): భార్య దూరం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి తనువు చాలించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపురం ప్రాంతానికి చెందిన తమ్మిన వరుణ్‌కుమార్ (34) లైటింగ్, డ్రైవింగ్ పనులు చేసుకుంటూ తల్లితో కలిసి ఉండేవాడు. కొన్ని సంవత్సరాల క్రితం భార్యతో గొడవ జరగడంతో ఆమె భర్తకు దూరమైంది. ఇంతకాలం భార్య వస్తుందని ఎదురుచూశాడు. ఆమె ఇంక రాదని నిర్ధారణకు వచ్చి మూడు నెలలుగా 'చనిపోతాను..భార్య, పిల్లలు లేరు' అనుకుంటూ వచ్చి.. చివరకు ఇంట్లో దూలానికి తాడుతో ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.